
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5 | బుధవారం 19 నవంబరు 2025

గరిష్ఠం 28.0
కనిష్ఠం 15.0
****



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.80 (299.7430)	నిల్	14,697
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.20 (4.25)	1,031.82	723.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

జల్‌సాథి అవార్డు అందుకున్న పీడీ శేఖర్‌రెడ్డి



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్.పాటిల్ నుంచి అవార్డు అందుకుంటున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జల్‌సాథి అవార్డును డీఆర్డీవో శేఖర్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో జలశక్తి మంత్రి సీఆర్.పాటిల్ నుంచి అందుకున్నారు. 'జల్ సంచయ్.. జల్ భాగీదారీ'లో భాగంగా కేంద్రం నిర్వహించిన సర్వేలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. అందుకు జిల్లా గ్రామీణా అభివృద్ధి పీడీ వై.శేఖర్‌రెడ్డి ఈఅవార్డును అందుకున్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు

నల్లగొండ కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎం.ఏ.హఫీజ్‌ఖాన్, కార్యదర్శి బానోతు బాలమ్మ ప్రారంభించారు. ఇందిరాగాంధీ చిత్రాన్ని అంశంగా ఈ పోటీ జరిగింది. అదేవిధంగా 'నా గ్రంథాలయం.. నాకు ప్రోత్సాహం' అనే అంశంపై చర్చా కార్యక్రమం ఆసక్తిగా సాగింది.



పంచాయతీ ఎన్నికలకు రేస్

గ్రామపంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావహుల్లో మళ్లీ సందడి మొదలైంది. సెప్టెంబరులోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినా, రిజర్వేషన్ల పరిధి 50శాతం దాటడంతో హైకోర్టు స్టేతో ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లు గవర్నర్ ఆమోదం పొందకపోవడం, హైకోర్టులోనూ కేసులు కొనసాగుతుండడంతో ఎన్నికలు నిలిచి పంచాయతీలకు పాలకవర్గాల్లేని పరిస్థితి కొనసాగుతోంది.

\- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- బీసీ డెడికేషన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా రిజర్వేషన్లు
- నెలాఖరులోగా కొత్త రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం
- ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే సిద్ధమైన అధికార యంత్రాంగం

రాష్ట్రంలో సుమారు రెండేళ్లుగా పంచాయతీలకు పాలకవర్గాలు లేపోవడంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్‌పడింది. వచ్చే మార్చి నెలాఖరుకు 16వ కేంద్ర ఆర్థిక సంఘం గడువు ముగియనుండడంతో, ఈలోగా పాలకవర్గాలు కొలువుదీరకపోతే రాష్ట్రంలోని పంచాయతీలకు రావాల్సిన సుమారు రూ.3వేల కోట్ల నిధులు వెనక్కివెళ్లే ప్రమాదం నెలకొంది. దీంతో డిసెంబరు నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది.

నెలాఖరుకు రిజర్వేషన్లు వెలువడే ఛాన్స్

కోర్టు తీర్పు రాకమునుపే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించడంతో రిజర్వేషన్లపై ఎలా ముందుకెళ్లాలనే అంశంలో బీసీ డెడికేషన్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం సలహా కోరింది. వారంలోగా ఈ కమిషన్ నుంచి సూచనలు వచ్చాక, అందుకు అనుగుణంగా పంచాయతీలు, వార్డులకు అధికారిక రిజర్వేషన్లు పునఃకేటాయింపు చేస్తారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు గరిష్ఠంగా 50శాతానికి లోబడి రిజర్వేషన్లు ఇచ్చే క్రమంలో బీసీలకు 25శాతం, ఎస్టీలకు 7శాతం, ఎస్సీలకు 18శాతం రిజర్వేషన్లు అధికారికంగా కేటాయిస్తారని తెలుస్తోంది. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం బీసీ అభ్యర్థులను రిజర్వేషన్లకు మించి 42 శాతానికి తగ్గకుండా కేటాయిస్తారని సగటున 50శాతానికి మించి బీసీ అభ్యర్థులకు టికెట్లు కేటాయించేందుకు పార్టీపరంగా సన్నద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. సెప్టెంబరులో ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ, మహిళల రిజర్వేషన్లను యథావిధిగా కొనసాగిస్తూ, బీసీలకు ఇచ్చిన 42శాతం సీట్లలో డెడికేషన్ కమిషన్ సూచించే ప్రకారం రిజర్వేషన్లు ఉండనున్నాయి. ఏ ప్రాతిపదికన అధికారిక సీట్లలో 25శాతానికి మించి ఉన్న కేటగిరీలను తొలగించాలనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారని అధికార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఎస్సీ, ఎస్టీ స్థానాలు సహా బీసీలకు సైతం మళ్లీ తాజాగా జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయిస్తారని అంచనా వేస్తున్నారు. డెడికేషన్ కమిషన్ సిఫారసుల ఆధారంగానే తాజా రిజర్వేషన్ల ప్రకటన ఉండనున్నట్లు తెలిసింది. జిల్లా అధికారులు మాత్రం ప్రభుత్వం ఏ విధంగా సూచిస్తే ఆ విధంగా రిజర్వేషన్లు కేటాయించేందుకు అవసరమైన కార్యాచరణను ఇప్పటికే సిద్ధం చేసుకొని ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. గరిష్ఠంగా ఈ నెలాఖరులోగా పంచాయతీల రిజర్వేషన్ల కేటాయింపు పూర్తవుతుందని భావిస్తున్నారు.

సిద్ధమైన అధికార యంత్రాంగం

జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు అవసరమైన ప్రాథమిక కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సర్వం సిద్ధం చేసింది. నల్లగొండ జిల్లాలోని 33 మండలాల్లోని 869 పంచాయతీలకు, 7,494

- మిగతా 7వ పేజీలో...

జిల్లాలో 427 పంచాయతీలు, మొత్తం 3704 వార్డులు ఉన్నాయి. అధికారులు 3,704 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. మొత్తం ఓటర్లు 2,86,430 కాగా, వీరిలో పురుషులు 1,42,585 మంది, మహిళలు 1,43,845 మంది ఉన్నారు. ● సూర్యాపేట జిల్లాలో 486 గ్రామ పంచాయతీలు, మొత్తం 4,388 వార్డులు ఉన్నాయి. అధికారులు 4,403 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో గ్రామీణ ఓటర్లు 6,94,815మంది ఉన్నారు. అందులో 3,40,743మంది పురుషులు, 3,54,050మంది మహిళలు, 22 మంది ఇతరులు ఉన్నారు.

సాగర్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు పరిశీలన

బీజాపూర్ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ బృందం రాక



బీసీ గురుకుల పాఠశాలలో రక్షణ మంత్రిత్వశాఖ బృందం

నాగార్జునసాగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ హిల్‌కాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అధికారుల బృందం పరిశీలించింది. మంగళవారం ఈ మేరకు కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ రాజ్యలక్ష్మీపృథ్వీరాజ్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కెప్టెన్ రాజ్యలక్ష్మీపృథ్వీరాజ్ మాట్లాడుతూ సైనిక్ స్కూల్ ఏర్పాటుకు ఈ ఏడాది జూలైలో రాష్ట్రంలో సొంత భవనాలున్న 21 గురుకుల పాఠశాలల నుంచి దరఖాస్తులు అందాయన్నారు. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్, నకిరేకల్ పరిధిలోని మూసీ బీసీ గురుకుల పాఠశాలలకు సంబంధించిన పత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాల ఆట స్థలం, భవనం తదితర అంశాలపై తాము గమనించిన అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు వివరించారు. ఆమె వెంట కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, బీసీ గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ స్వప్న తదితరులు ఉన్నారు.

సైనిక్ స్కూల్ ఏర్పాటుకు సహకరిస్తాం: సబ్ కలెక్టర్

మిర్యాలగూడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అన్ని విధాల సహకరిస్తామని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. మంగళవారం సైనిక్‌స్కూల్ ఏర్పాటుకు నాగార్జునసాగర్ బీసీ బాయ్స్ రెసిడెన్షియల్ స్కూల్, మూసీ బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌ను పరిశీలించి వచ్చిన రక్షణమంత్రిత్వ శాఖకు చెందిన ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ కెప్టెన్, బీజాపూర్ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి పృథ్వీరాజ్, బీసీ వెల్ఫేర్ జిల్లా కోఆర్డినేటర్ స్వప్న, నల్లగొండ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాసుల బృందం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌ను సైనిక్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు అనుకూలమైన అంశాలను చర్చించారు.

యువత మత్తుపదార్థాల బారిన పడొద్దు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ టౌన్,నవంబరు18 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాల బారినపడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గౌతమి జూనియర్ కళాశాలలో పోలీస్, జిల్లా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మత్తు మందులు,మద్యం వంటి వ్యసనాలకు యువత బానిసలు కావొద్దన్నారు. జీవితం బాగుండాలంటే కష్టపడి చదవాలని సూచించారు. అదనపు ఎస్పీ రమేష్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారప డి ఉందన్నారు.అనంతరం మత్తుపదార్థాలకు దూరం గా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం కృషి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ క్రైం): మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్ ప్రమాదంలో పడుతుందన్నారు. యువత మత్తు నిరోధక సంకల్పాన్ని పెంపొందించుకోవాలని, అందుకు జిల్లా పోలీస్‌శాఖ తరఫున పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో కుంభకోణం

బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్‌లీడర్ మహేశ్వర్‌రెడ్డి



రైతు నిరాహార దీక్ష విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణానికి పాల్పడుతోందని బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతు నిరాహార దీక్ష విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు మోసపూరిత ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక రైతులను, యువతను మోసగిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,500కోట్ల కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. తన ఆరోపణలు నిజం కాదని కాంగ్రెస్ నాయకులు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. తన సవాల్‌ను స్వీకరించే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ఏ వర్గాలు సంతోషంగా లేవన్నారు. పోరాటాల గడ్డ నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు హెలికాప్టర్లలో ప్రయాణిస్తూ చక్కర్లు కొడుతూ ఎంజాయ్ చేస్తున్నారని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ నేత గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతరెడ్డి, నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజు, పోతేపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, ఫకీరు మోహన్‌రెడ్డి, ఓరుగంటి వంశీ, గడ్డం మహేష్, మిర్యాల వెంకటేశం, సురకండి రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, నేత పిల్లి రామరాజు నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.

ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రీజనల్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.2కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పాండు రంగయ్య, కేఎస్.రెడ్డి, వెంకటయ్య, జమాల్, ఎన్ఆర్ఎస్.రాజు, ఎం.నందం, వీఎస్.రెడ్డి, ఏఎల్.స్వామి, కోటయ్య, వెంకన్న, మంజుల, చంద్రకళ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టెట్ అర్హత నిబంధనను ఎత్తివేయాలి

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు గుదిబండలా మారిన టెట్ అర్హత నిబంధనను ఎత్తివేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010 తర్వాత నియామకమైన ఉపాధ్యాయులకు మాత్రమే టెట్‌ను పరిమితం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేసిందని, అది విచారణలోకి రాక ముందే తిరిగి ప్రభుత్వం హడావిడిగా టెట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థులకు పరీక్షా సమయం కావడంతో ఇలాంటి సమయంలో ఉపాధ్యాయులు విధులను సక్రమంగా నిర్వహించలేక మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెట్ ప్రభావం రాష్ట్ర వ్యాప్తంగా 45,742మంది ఉపాధ్యాయులపై ఉందన్నారు.

జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

కొండమల్లేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. డిండి మండలానికి వెళ్లివస్తూ ఇక్కడికి వచ్చిన ఆయన ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో స్వర్ణలత, ఎంపీవో మధు, వినోద్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ

నల్లగొండ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డితో కలిసి మంగళవారం జిల్లా కేంద్రంలోని పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి అనుమానాస్పద లింకులు, యాప్స్, మెసెజ్‌లు ఓపెన్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపాలరావు, సైబర్ క్రైం ఎస్ఐ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య బీమాతో ధీమా

ఆరోగ్య బీమా ప్రతీ ఒక్కరి జీవితానికి ధీమా ఇస్తుందని అదనపు ఎస్పీ రమేష్ అన్నారు. మంగళవారం హోంగార్డు సిబ్బందికి ఆరోగ్య బీమాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టిసారించాలని, ఏదైనా అనుకోని సమస్య వస్తే బీమా ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, హోంగార్డు ఆర్ఐ శ్రీను, బ్యాంక్ మేనేజర్లు సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



చింతపల్లిలో జాతాకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ సత్యం, మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు

చింతపల్లి, కొండమల్లేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో డిసెంబరు 26న నిర్వహించే సీపీఐ శతాబ్ది ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. మంగళవారం చింతపల్లి మండల కేంద్రంలో, కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చేరిన ప్రచార జాతాలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహించడంలో సీపీఐ ముందు వరుసలో ఉందన్నారు. రాజ్యాంగ హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎం.బాలనరసింహ, పల్లా నర్సింహారెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, ఆర్.అంజయ్యనాయక్, పల్లా దేవేందర్‌రెడ్డి, తూం బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, వి.ఆంజనేయులు, జగన్, గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, శేఖరాచారి, జయరాములు, సుదర్శన్‌రెడ్డి, రామస్వామి, కల్లు చరణ్‌రెడ్డి, సోమ్లానాయక్, వెంకటయ్య, అంజనాయక్, పోలే వెంకటయ్య, ఉజ్జిని అంజన్‌రావు, మల్లోజు శేఖరాచారి, వేముల బుచ్చయ్య, పల్లపు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ వందేళ్లుగా పేదల పక్షాన

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): సీపీఐ వందేళ్లుగా ప్రజలపక్షాన పోరాడుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం గద్వేల్‌కు చేరిన బస్సుజాతాలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే వందేళ్ల ముగింపు ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

22న గీత కార్మికుల సదస్సు

చిట్యాలరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని గీతపనివార సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గుండ్రాంపల్లిలో సంఘం ఆధ్వర్యంలో ప్రచార కరపత్రాన్ని సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గీత కార్మికుల సమస్యలు ఏళ్లుగా అపరిష్కృతంగానే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.13కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, కార్మికులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలని, గీత స్కిల్ యూనివర్సిటీని, గీత కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మిద్దెల రామలింగయ్యగౌడ్, బొడిగె బక్కశెట్టి, ఉయ్యాల చంద్రయ్య, మారగోని యాదయ్య, గోపగోని అచ్చులు, కోయగూర యాదయ్య, నమ్ముల కృష్ణయ్య, గోపగోని శెట్టి, పాలెం జంగయ్య, చెదురుపల్లి శ్రీను, పాల్గొన్నారు.

సహజ పద్ధతుల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



గుండ్రాంపల్లిలో వరి చేనును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

చిట్యాలరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హానికరమైన రసాయనాలతో వ్యవసాయం చేస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని, సహజ పద్ధతుల్లో వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రాయితీలు కల్పిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుండ్రాంపల్లిలో పలువురు రైతుల వరి చేలను ఆయన పరిశీలించారు. వరి నారుమడి ఎదుగుదల గురించి తెలుసుకొని సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహజ పద్ధతిలో వ్యవసాయ సాగుతో ఆరోగ్యకర పంటలు చేతికివస్తాయన్నారు. ఎరువులు, పురుగుమందులు అధికంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతిని పంటల దిగుబడి తగ్గడమేగాక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. చలికాలంలో వరినారు ఎదుగుదలకు రైతులు తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. నారుమడిలో వెదురు కర్రలతో ఊతమిచ్చి పైన పలుచని పాలిథిన్ షీట్ లేదా యూరియా బస్తాలతో తయారు చేసిన పట్టాలను సాయంత్రం వేళల్లో కప్పాలని, మరుసటి రోజు తీసేయాలన్నారు. చలికి నీరు చల్లబడుతుందని, దాన్ని తొలగించి తిరిగి నీటినందించాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి పగిడిమర్రి గిరిబాబు, ఏఈవో మీనాకుమారి ఉన్నారు.

అంగన్‌వాడీ భవనాలకు మోక్షమెన్నడో!

(ఆంధ్రజ్యోతి-తుర్కపల్లి)

అద్దెభవనాలు, అరకొర సౌకర్యాల మధ్య అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు మధ్యలోనే నిలిపివేశారు. దీంతో అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్య పిల్లలు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో 61 అంగన్‌వాడీ కేంద్రాలుండగా తుర్కపల్లి సెక్టార్‌లో 32 కేంద్రాలకుగాను కేవలం 8 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. 8 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మరో 16 కేంద్రాలు కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ పాఠశాలలలో నిర్వహిస్తున్నారు. మాదాపూర్ సెక్టార్‌లో 29 కేంద్రాలకు 4 చోట్ల మాత్రమే సొంత భవనాలు ఉండగా ఆరు కేంద్రాలు అద్దె భవనాల్లో, 19 కేంద్రాలు సామాజిక భవనాలు, పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. రెండు సెక్టార్లలో కలిపి నాలుగేళ్ల లోపు పిల్లలు 827 మంది ఉన్నారు. ఇదిలా ఉండగా కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు. కొన్నిచోట్ల పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశారు. కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు చేయకపోవడంతో పనులను మధ్యలోనే వదిలేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించి అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలి



కొన్నేళ్లుగా అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నాం. దీంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. కేంద్రంలో కనీస మౌలిక వసతు లు లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నాం. అన్ని మౌలిక వసతులతో నూతన భవనం నిర్మించాలి.

- నూనావతు కవిత, జేతురాంతండా, తుర్కపల్లి

నూతన భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మాణానికి గ్రా మం నుంచి స్థలం ఇవ్వాల్సి ఉంది. ఆ మేరకు గ్రామంలో ప్రభు త్వ స్థలం ఉన్న చోట అంగన్‌వాడీ కేంద్ర భవనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. కొన్ని కేంద్రాలకు ప్రభు త్వం నుంచి నిధులు మంజూరు చేయగా, పనులు ప్రారంభించారు.

- రేకల స్వరాజ్యం, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్, ఆలేరు

తగ్గుతున్న ఆదరణ

» అంగన్‌వాడీ కేంద్రాల్లో తగ్గుతున్న చిన్నారుల సంఖ్య

» శిథిలావస్థలో కేంద్రాలు

(ఆంధ్రజ్యోతి-డిండి)

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆదరణ కరువైంది. దీంతో క్రమంగా కేంద్రాల్లో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. అద్దె, శిథిలావస్థకు చేరిన భవనాల్లో కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఉన్న భవనాల్లో మౌలిక వసతులు కానరావడంలేదు. నల్లగొండ జిల్లా డిండి మండలంలోని కందుకూరు, ఎర్రారం, డిండి సెక్టార్ల పరిధిలో 73 అంగన్‌వాడీ కేంద్రాలు సేవలను అందిస్తున్నాయి. అందులో 32 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 14 కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. 27 కమ్యూనిటీ హాల్స్ పాఠశాల్లో నిర్వహిస్తున్నారు. సింగరాజుపల్లిలో భవనం అసంపూర్తిగా ఉంది. డిండి మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో 2013లో నిర్మించిన భవనానికి తలుపులు, కిటికీలు బిగించలేదు. కాంట్రాక్టర్‌కు రూ.1.5లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులను నిలిపివేశాడు. డిండి అంగన్‌వాడీ కేంద్రం1 శిథిలావస్థకు చేరింది. పిల్లలమీద పెచ్చులూడి ఎప్పుడు పడుతాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం-3కు పక్కా భవనం నిర్మాణానికి ఉపాధి నిధులు రూ.12లక్షలు మంజూరయ్యాయి. నేటికి పనులు ప్రారంభించలేదు.



శిథిలావస్థలో ఉన్న డిండి అంగన్‌వాడీ సెంటర్

తక్కువ సంఖ్యలో చిన్నారులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. డిండిలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో కేవలం 5 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. ఇదే తరహాలో మండలంలోని అనేక అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్ల ల సంఖ్య తక్కువగా ఉంది. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు చెప్పిన వివరాల ప్రకారం 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 741 మంది, 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల పిల్లలు 302 మంది ఉన్నారు. మూడేళ్ల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి పూర్వ ప్రాథమిక విద్యను అందించాల్సి ఉంది ఐదేళ్ల పూర్తికాగానే సమీపంలోని పాఠశాలలో చేర్పించాల్సి ఉంటుంది. కాని మూడేళ్ల వయసులోనే చిన్నారులను తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తుండడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య తగ్గుతున్నట్లు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.

వేతనం తక్కువ, పనిభారం ఎక్కువ

అంగన్‌వాడీ టీచర్లకు రూ.13600 నెలసరి గౌరవ వేతనాన్ని అందజేస్తున్నారు. వీరిని బీఎల్‌వోల పని మొదలుకొని ప్రభుత్వం నిర్వహించే ప్రతి సర్వేలోనూ భాగస్వాములను చేస్తున్నారు. ఐసీడీఎస్ పరిధిలో నిర్వహించే అవగాహన సదస్సులు కూడా వీరు నిర్వహిస్తుంటారు. పనిభారం పెరిగినా ఉపాధ్యాయులకు వేతనాలు పెరగడం లేదు.

మూడేళ్ల చిన్నారులను ప్రైవేట్‌లో చేర్పిస్తున్నారు



మూడేళ్ల చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో బదులుగా ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో ఆయా కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 5 ఏళ్లు పూర్తయిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంటుంది. పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్నా తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లోననే చేర్పిస్తున్నారు.

- చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్

గీత కార్మికుడికి గాయాలు

మోత్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బీసు సదయ్య మంగళవారం తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి మోత్కూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

వేములపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా వేములపల్లి ఎస్‌ఐ డీ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రావులపెంట గ్రామానికి చెందిన ఉత్తెర్ల సైదయ్య, శీలం నరేష్ తమ ట్రాక్టర్ల ద్వారా గ్రామశివారులోని పాలేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా సల్కునూరు క్రాస్‌రోడ్డు సమీపంలో మైనింగ్ అధికారులు పట్టుకున్నారన్నారు. ఆయా ట్రాక్టర్లను మైనింగ్ అధికారులు తమకు అప్పగించగా ఉత్తెర్ల సైదయ్య, శీలం నరేష్‌లతో పాటు వారి ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని బలవన్మరణం

యాదాద్రిభువనగిరి జిల్లాలో మద్యానికి బానిసైన ఇరువురు ఒకే రోజు ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్నేహితులు చేయి చేసుకున్నారని నల్లగొండ జిల్లా దేవరకొండలో ఓ వ్యక్తి బలవన్మరణం చెందారు.

భువనగిరి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కుమారుడితో కలిసి భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో జరిగింది. స్థానిక బహార్‌పేటకు చెందిన భానుక సంతోష్(31) ఓ దుకాణంలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడి వైఖరితో విసిగిపోయిన భార్య కుమారుడిని తీసుకుని కొంతకాలం కిందట పుట్టింటికి వెళ్లింది. దీనిని అవమానంగా భావించిన సంతోష్ మునిసిపల్ కార్యాలయం సమీపంలోని బైపాస్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫ్లైఓవర్ నుంచి దూకే ప్రయత్నాలను కింది నుంచి గమనించిన పలువురు నిలువరించే లోపే రోడ్డుపై పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంతోష్(ఫైల్)

చౌటుప్పల్‌లోనూ...

చౌటుప్పల్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి అలవాటు అయినా భర్త వేధింపులు భరించలేక భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన భర్త ఉరివేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరిగింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణ కేంద్రం బంగారిగడ్డకు చెందిన సయ్యద్ రఫీ(27)కి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామానికి చెందిన యువతితో ఐదేళ్ల కిందట వివాహమైంది. ఇద్దరు సంతానం కాగా రఫీ స్థానికంగా వెల్డింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజూ మద్యం తాగి వస్తుండటంతో భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య 20 రోజుల క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లింది. వారం క్రితం రఫీ భార్యను తీసుకరావడానికి ఇనాంగూడకు వెళ్లాడు. అక్కడ భార్య, మామ, బావమరుదలు తాగి తమ కుమార్తెను ఇబ్బందులు పెడుతున్నావని రఫీని దూషించారు. భార్య రాకపోవడం, అత్తగారి కుటుంబసభ్యులు దూషించడంతో మనస్థాపానికి గురైన రఫీ సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఉదయం గమనించిన ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదుచేశాడు. తండ్రి షార్ఫోద్దిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

స్నేహితులు చేయి చేసుకున్నారని...

దేవరకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండలో స్నేహితులు చేసుచేసుకున్నారని మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా కారంపొడి మండలం ఉప్పునూతల గ్రామానికి చెందిన కామిశెట్టి యేసుబాబు(23) ఏడాదిగా మండలంలోని పెంచికల్‌పహడ్‌లో ఇటిక బట్టీలో కూలీగా పనిచేస్తు కుటుంబంతో జీవిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా యేసుబాబు సోమవారం రాత్రి దేవరకొండ పట్టణానికి వచ్చి పెంచికల్‌పహడ్‌కు వెళ్తుండగా పట్టణానికి చెందిన ముగ్గురు యువకులతో గొడవపడ్డాడు. యేసుబాబు ద్విచక్రవాహనం అదుపుతప్పి గణేష్ అనే యువకునికి తగిలింది. దీంతో గణేష్, అతని మిత్రులు రాములు, నవీన్‌లు యేసుబాబును దూషించి చెయ్యి చేసుకున్నారు. దీంతో మనస్థాపానికి గురైన యేసుబాబు మంగళవారం ఉదయం భార్య ఇటుక బట్టీలో పనికి వెళ్లగా ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తోటి కూలీలు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యేసుబాబు భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అసోంలో పిట్టెలగూడెం వాసి మృతి

గుర్రంపోడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసోం రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం వాసి మృతి చెందాడు. పిట్టెలగూడెం గ్రామానికి చెందిన లారీడ్రైవర్ పసిమేకల మల్లయ్య(50) మంగళవారం అసోంలో ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మల్లయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మల్లయ్య (ఫైల్‌ఫొటో)

చికిత్స పొందుతూ ఒకరి ...

కట్టంగూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామానికిచెందిన పాలడుగు అంజయ్య సెంట్రింగ్ పనిచేస్తూ పని ముగించుకుని ద్విచక్రవాహనంపై తన భార్య రేణుకతో కలిసి సోమవారం రాత్రి నార్కట్‌పల్లికి బయలుదేరాడు. మార్గమధ్యలోని అయిటిపాముల వద్ద శ్రీకృష్ణనగర్ వద్ద హైవేపై హైదరాబాద్ నుంచి వస్తున్న కారు టైరుపేలి వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంజయ్యను మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

గర్భవిచ్ఛిత్తికి యత్నం

ఆసుపత్రి నిర్వాహకురాలిపై పోలీసులకు ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు

చిట్యాల/చిట్యాల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ విద్యార్థినికి గర్భవిచ్ఛిత్తికి యత్నించిన ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకురాలిపై నల్లగొండ జిల్లా ఐసీడీఎస్ అధికారులు చిట్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూపర్‌వైజర్ సునీత మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిట్యాల మండలంలోని ఓ గ్రామానికి బాలిక ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఆమె గర్భం దాల్చిందన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బాలికను నిలదీయటంతో పక్క మండలానికి చెందిన తన క్లాస్‌మేట్ ఇందుకు కారణమని తెలిపింది. దీంతో తల్లిదండ్రులు ఆమెకు గర్భవిచ్ఛిత్తి చేయించేందుకు ఈ నెల 17వ తేదీన చిట్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. విషయం తెలిసిన గుర్తుతెలియని వ్యక్తి డయల్-100కు కాల్ చేసి పోలీసులకు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆసుపత్రికి చేరుకున్న ఐసీడీఎస్ అధికారులు బాలికను సఖీ కేంద్రానికి తీసుకెళ్లి విచారించారు. కౌన్సిలింగ్ అనంతరం నల్లగొండలోని భరోసా కేంద్రానికి తరలించారు. అబార్షన్‌కు యత్నించిన ఆసుపత్రి నిర్వాహకురాలిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదుపై వివరణకు ప్రయత్నించగా పోలీసులు స్పందించలేదు.

భార్యను హత్యచేసిన భర్త రిమాండ్

మోతె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మోతె మండలంలో అనుమానంతో భార్యను హత్య చేసిన భర్తను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన కారింగుల పద్మను భర్త కారింగుల వెంకన్న ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో రోకలిబండతో కొట్టి హత్య చేశాడు. అనంతరం పోలీసులకు లొంగిపోయాడు. విచారణ అనంతరం వెంకన్నను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

గుండాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని మర్రిపడగ గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో 40క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. గ్రామానికి చెందిన బోయిని అంజయ్య నాలుగున్నర ఎకరాల్లో పత్తి సాగు చేయగా దిగుబడిగా వచ్చిన పత్తిని ఇంట్లో నిల్వ చేశాడు. రోజు వారీగా వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా మధ్నాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో పొగలు వస్తుండటంతో స్థానికులు గుర్తించి అంజయ్యకు తెలిపారు. ఇంటికి చేరుకునే సరికి పత్తి పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న వస్తువులు కూడా కాలిపోయాయి. దీంతో సుమారు రూ.3లక్షలు నష్టపోయానని ప్రభుత్వం ఆర్థికసాయం అందచేసి ఆదుకోవాలని రైతు అంజయ్య కోరారు.



షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన పత్తి

గంజాయి సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్

హాలియా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సరఫరా చేస్తున్న యువకుల ముఠాను నల్లగొండ జిల్లా హాలియ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ రాజశేఖరరాజు హాలియా పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. హాలియా పరిసర ప్రాంతాల్లోని కొంతమంది యువకులు గంజాయికి అలవాటుపడి పల్నాడు జిల్లా మాచర్లకు వెళ్లి అక్కడి సరఫరాదారుల నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నారు. మాచర్లకు చెందిన చల్లా చినఆంజనేయులు అలియాస్ బండా అంజి, చల్లా పెద్దఆంజనేయులు అలియాస్ మ్యాక్స్ గుంటూరు ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి హాలియా ప్రాంత యువతకు విక్రయిస్తున్నారు. హాలియాకు చెందిన ద్విచక్రవాహన మెకానిక్ మహ్మద్ రియాజ్‌బాబు, సెల్‌ఫోన్ టెక్నీషియన్ సల్లా అజయ్, హజారీగూడెం గ్రామానికి చెందిన విద్యార్థి షేక్ ఇషాన్ హుస్సేన్, మాచర్లకు చెందిన మేస్త్రీ చల్లా చినఆంజనేయులను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశామని, మరో ముగ్గురు మాచర్లకు చెందిన చల్లా పెద్ద అంజనేయులు అలియాస్ మ్యాక్స్ అలీనగర్ చెక్‌పోస్ట్‌కు చెందిన పంపు ఆపరేటర్ అమరవరపు జేమ్స్, హాలియా రెడ్డికాలనీకి చెందిన డీజే ఆపరేటర్ కేశమళ్ల అంజి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.30 వేల విలువైన 1200 గ్రాముల గంజాయి, పల్సర్ బైక్, నాలుగు సెల్‌ఫోన్‌లు, రూ.2వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం నిందితులను కోర్టుకు రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో సీఐ సతీష్‌రెడ్డి, ఎస్‌ఐ సాయిప్రశాంత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు, పక్కన సీఐ సతీష్‌రెడ్డి

మహిళా పొదుపు సంఘాలకు కుచ్చుటోపీ

నల్లగొండ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాలో పొదుపు సంఘాలకు సంబంధం లేకుండానే రూ.కోటిన్నరకు పైగా నిధులు స్వాహా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. 10 రోజుల క్రితమే నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంకు ఎదుట వివిధ మహిళా సంఘాల సభ్యులు ఆందోళనకు దిగారు. తమకు ఎలాంటి సంబంధం లేకున్నా తమ ఆధార్‌కార్డులు, బ్యాంకు అకౌంట్లను తీసుకొని మోసం చేశారని మహిళలు ఆందోళన చేపట్టారు. అయితే అప్పట్లో ఆ బ్యాంకుతో పాటు ఇతర బ్యాంకర్లు కూడా నచ్చజెప్పినట్లు తెలిసింది. అయితే తీసుకున్న రుణాలను చెల్లించాలంటూ ఇటీవల వారికి మళ్లీ నోటీసులు వెళ్లడంతో ఆందోళనకు గురైన మహిళా సంఘాల సభ్యులు సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. అనంతరం అధికారులకు తమకు జరిగిన నష్టాన్ని వివరించి న్యాయం చేయాలని కోరారు. కేశరాజుపల్లి గ్రామానికి చెందని 12 పొదుపు మహిళా సంఘాలకు సంబంధించిన సంఘ సభ్యుల నుంచి కొద్దిరోజుల కిందట రూ.10వేల చొప్పున అక్రమంగా వసూలు చేసినట్లు తెలిసింది. దీనికి తోడు అదే సంఘానికి చెందిన సభ్యులపైన వారికి తెలియకుండానే రూ.1కోటి50లక్షలను వారి పేరు మీద రుణాలు తీసుకొని స్వాహా చేశారు. ఆయా బ్యాంకు ఉద్యోగులతో కలిసి ఈ నిధులు స్వాహా చేశారా లేదంటే బుక్ కీపర్ నిధులు కాజేసిందా అనేది విచారణలో తెలియాల్సి ఉంది. బ్యాంకు ఫీల్‌ఆఫీసర్లపైన కూడా ఆయా సంఘాల సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాము తీసుకోని రుణాలకు నోటీసులు ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. బ్యాంకు ఉద్యోగులు నాలుగు నెలలుగా ఆయా సంఘాల సభ్యులు తీసుకున్న డబ్బులు చెల్లించడంలేదని నోటీసులు ఇవ్వడంతో సదరు మహిళా సంఘాల సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ ఆధార్ కార్డులను, బ్యాంక్ అకౌంట్లను జీరాక్స్‌లను తీసుకెళ్లి అక్రమంగా డబ్బులు కాజేశారని సభ్యులు ఆరోపిస్తున్న నేపథ్యంలో అధికారులు ఏ మేరకు విచారణ చేసి వారికి న్యాయం చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

అసౌకర్యాల మధ్య గురుకులం

మిర్యాలగూడ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురంలోని బాలుర గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. గురుకులంలో 504 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ ఉత్తమ విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే గురుకులాల్లో చేరితే ఇక్కడి అవస్థలు ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితులు దర్శనమిస్తున్నాయి.

ఇరుకు గదులతో ఇక్కట్లు

గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలగా ఏర్పాటుచేసిన తదుపరి విద్యార్థులను వేరుగా విభజించారు. పాఠశాల, కళాశాల నిర్వహణను వేర్వేరుగా ఏర్పాటు చేసినప్పటికీ పాఠశాల విద్యార్థులకు అనుకూలంగా వసతిగృహాలు లేకపోవడంతో ఇరుకు గదుల్లోనే సర్దుకుంటున్నారు. చలికాలం రావడంతో సరిపడా దుప్పట్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారు.

మరుగుదొడ్లు కనుమరుగు

పాఠశాల ఏర్పాటుచేసి రెండు దశాబ్దాలు కావొస్తున్నా అధికారులు మాత్రం విద్యార్థుల వసతి సౌకర్యాల ఏర్పాటుపై పర్యవేక్షణ చేపట్టలేదు. ఆనాడు ఏర్పాటుచేసిన స్నానపు గదులు, మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం విద్యార్థులకు ఎలాంటి స్నానపు గదులు, మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో ఆరుబయటే అన్ని కార్యక్రమాలను సాగిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల ఆవరణ, పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారింది. విద్యార్థుల అవసరాలను గుర్తించి సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



ఇరుకు గదుల్లో సర్దుకుంటున్న పాఠశాల విద్యార్థులు

ఉన్నతాధికారులకు తెలియచేశాం

పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై ఉన్నతాధికారులకు తెలియపరిచాం. విద్యార్థులకు సరిపడా డార్మెటరీ రూమ్‌లు అదనంగా ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు, స్నానపు గదులు రిపేర్ చేయించాలని, అదనంగా టాయ్‌లెట్స్ నిర్మాణం చేపట్టాలని కోరాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తాం.

- ముజీబ్ హుస్సేన్, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల అవంతీపురం

రాజేష్‌ను విచారణ పేరుతో వేధించారు

● న్యాయంచేయాలంటూ

కుటుంబ సభ్యుల ఆందోళన

కోదాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విచారణ పేరుతో పోలీసులు కొట్టడంతోనే రాజేష్ మృతి చెందాడని, అతడి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఎస్పీ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. కోదాడ పట్టణానికి చెందిన కర్ల రాజేష్(32)ను సీఎంఆర్‌ఎఫ్ రిలీఫ్‌ఫండ్ అక్రమాల కేసులో చిలుకూరు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 10న అతడిని పోలీసులు హుజుర్‌నగర్ సబ్‌జైలు తరలించారు. రాజేష్ అస్వస్థతకు గురికాగా చికిత్సనిమిత్తం జైలు సిబ్బంది హుజుర్‌నగర్ ఆస్పత్రికి, అక్కడ నుంచి సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ రాజేష్ ఆదివారం ఉదయం మృతి చెందారు. సోమవారం రాత్రి రాజేష్ మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి కోదాడకు తీసుకువచ్చి బంధువులకు పోలీసులు అప్పగించారు. ఈ నేపథ్యంలో రాజేష్‌ను పోలీసులు విచారణ పేరుతో దెబ్బలు కొట్టటంతోనే అస్వస్థతకు గురై మృతి చెందారని బంధువులు ఆరోపిస్తూ, రాజేష్ కుటుంబానికి న్యాయం చేయామని మంగళవారం ఉదయం డీఎస్పీ కార్యాలయానికి పెద్దఎత్తున తరలి వచ్చారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో సూర్యనారాయణ డీఎస్పీ కార్యాలయానికి రావడంతో అతడికి వినతిపత్రం అందజేశారు.



ర్యాలీగా డీఎస్పీ కార్యాలయానికి వస్తున్న రాజేష్ బంధువులు

ఆర్డీవో హామీతో ఆందోళన విరమణ

రాజేష్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం నుంచి అన్నివిధాలా ఆదుకుంటామని ఆర్డీవో సూర్యనారాయణ హామీ ఇచ్చారు. కోదాడ మాజీ సర్పంచ్ ఏర్నేని బాబు రాజేష్ కుటుంబానికి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. రాజేష్ విషయాన్ని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని రాజేష్ కుటుంబంలో ఒకరికి మునిసిపల్‌లో ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో రాజేష్ బంధువులు ఆందోళన విరమించారు. డీఎస్పీ కార్యాలయం ఎదుట ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఇదిలా ఉండగా రాజేష్ మృతికి పోలీసులను బాధ్యులను చేస్తూ హైకోర్టులో మంగళవారం లంచ్‌మోషన్‌లో రిట్‌పిటిషన్ వేసినట్లు సమాచారం.

ముగిసిన కోట మైసమ్మ బ్రహ్మోత్సవాలు

● వైభవంగా బోనాలు, కార్తీక దీపోత్సవం



కోటమైసమ్మ అమ్మవారికి బోనాలు తీసుకువస్తున్న భక్తులు

నిడమనూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండల పరిధిలోని ఇండ్లకోటయ్యగూడెం గ్రామ సమీపంలో కొలువై ప్రసిద్ధి చెందిన శ్రీ కోట మైసమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిసాయి. ప్రతీ సంవత్సరం పవిత్ర కార్తీకమాసంలో ఆలయంలో మూడు రోజుల పాటు ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజున సుప్రభాత సేవ, శతఘటాభిషేకం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. మంగళవాయిద్యాలతో ఆగమశాస్త్ర ప్రకారం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ పూజా కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారికి ఉదయం ఘనంగా బోనాలు సమర్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. చివరిరోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కొందరు భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చౌటి ఆంజనేయులు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ సిబ్బంది వితలేశ్వర్, రాజు, రమణయ్య, నర్సిరెడ్డి, నార్ల శ్రీనివాస్, పద్మ, కోటయ్య, పుష్ప, స్వాతి, వెంకన్న పాల్గొన్నారు.

మునుగోడు పీఏసీఎస్‌కు విశిష్ట గుర్తింపు

● ఐఎస్‌వో సర్టిఫికెట్ అందజేత



డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మునుగోడు ప్రాథమిక సహకార సంఘానికి విశిష్టమైన గుర్తింపు లభించింది. ఈ పీఏసీఎస్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్‌వో 9001: 2015 నాణ్యత నిర్వహణ సర్టిఫికేషన్ హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ నుంచి సాధించింది. ఈ సర్టిఫికెట్‌ను మంగళవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. ఐఎస్‌వో ప్రమాణాల ప్రకారం అన్ని పారామీటర్లను పరిశీలించేందుకు హెచ్‌వైఎం ఇంటర్‌నేషనల్ సర్టిఫికేషన్స్ బృందం మునుగోడు పీఏసీఎస్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా పీఏసీఎస్ నిర్వహిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను బృందం ప్రశంసించింది. పీఏసీఎస్ భవనం ఆధునికంగా నిర్మించడంతో పాటు యూరియాతో పాటు ఇతర వ్యవసాయ అవసరాలను సమర్థవంతంగా సరఫరా చేయడం, రుణాల మంజూరు, వసూళ్లలో పారదర్శకత పాటించారు. అదేవిధంగా వరి ధాన్యం సేకరణ, కొనుగోళ్లలో సమర్థత, పీఏసీఎస్ ఆదాయం పెంచడం, సిబ్బంది నిబద్ధతో పనిచేయడం వంటివి గుర్తించి ఈ సర్టిఫికెట్‌ను అందజేశారు. అదేవిధంగా రైతుల ప్రయోజనం కోసం ప్రత్యేక వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేసి వినియోగిస్తున్న ఏకైక సంఘంగా మునుగోడు పీఏసీఎస్ నిలిచిందని బృందం పేర్కొంది. అన్ని అంతర్గత ప్రక్రియలు ఐఎస్‌వో ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నందున సర్టిఫికెట్ మంజూరు చేయాలని సిఫారసు చేసింది. ఐఎస్‌వో సర్టిఫికేషన్ పొందిన తొలి సంఘంగా మునుగోడు పీఏసీఎస్ నిలిచింది. ఈ సందర్భంగా మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఆ సొసైటీ డైరెక్టర్లను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అభినందించారు.

మహబూబ్‌పేటలో చత్తీస్‌ఘడ్ బృందం



మహబూబ్‌పేటలో నర్సరీని పరిశీలిస్తున్న చత్తీస్‌ఘడ్ బృందం

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట మండలంలోని మహబూబ్‌పేట గ్రామంలో మంగళవారం చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన ఉపాధిహామీ అధికారుల బృందం పర్యటించింది. జాతీయ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో చేపడుతున్న పంచాయతీ భవన నిర్మాణం, నర్సరీ, డ్రాగన్‌ఫ్రూట్ తోట పెంపకం, మామిడి మొక్కలు, పెంపకం, కోళ్ల ఫారంలను బృందం పరిశీలించింది. వాటి నిర్వహణ తీరు, పూర్తి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి, అడిషనల్ డీఆర్‌డీవో సురేష్, పలువురు అధికారులు అనురాధ, జయశ్రీ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

● బంద్‌ను విరమించిన జిన్నింగ్ మిల్లులు
● ఊపిరి పీల్చుకున్న పత్తి రైతులు



చిట్యాల మండలం పెద్దకాపర్తిలో మిల్లు గేటుకు ఏర్పాటు చేసిన నిరవధిక బంద్ ఫ్లెక్సీ

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జిన్నింగ్ మిల్లుల బంద్‌ను యాజమాన్యాలు విరమించాయి. సీసీఐ నిబంధనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిన్నింగ్ మిల్లులు మంగళవారం బంద్ పాటించాయి. జిల్లాలోని అన్ని మిల్లులు తెరవాలని, రోజుకో నిబంధనతో సమస్యలు సృష్టించకుండా చూడాలని జిన్నింగ్ మిల్లుల యజమానులు డిమాండ్ చేస్తూ నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చారు. అయితే సీసీఐ సీఎండీ జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ నేతలతో భేటీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మిల్లులను రెండు మూడు రోజుల్లో తెరుస్తామని ఆయన హామీ ఇవ్వడంతో జిన్నింగ్ మిల్లుల యజమానులు బంద్‌ను ఉపసంహరించుకున్నారు.

ఇప్పటి వరకు 98,480 క్వింటాళ్లు కొనుగోలు

జిల్లా వ్యాప్తంగా 23 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఇప్పటి వరకు 23 మిల్లులను తెరిచారు. సోమవారం నాటికి 98,480 క్వింటాళ్లకు పైగా పత్తిని ఈ మిల్లులు కొనుగోలు చేశాయి. కాగా, సీసీఐ ప్రతీరోజు ఏదో ఒక నిబంధనను తీసుకవస్తుడటంతో రైతులతో పాటు జిన్నింగ్ మిల్లుల యజమానులు సతమతమవుతున్నారు. ఎకరానికి కేవలం 7క్వింటాళ్లే కొనుగోలు చేయడం, తేమశాతం 8 నుంచి 12శాతం లోపు ఉండాలనే నిబంధనలతో పాటు ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరుతో నిబంధనలను అమలులోకి తీసుకురావచ్చింది. దీంతో కొన్ని మిల్లులే తెరుచుకోగా, మిగిలిన మిల్లుల్లో కొనుగోళ్లకు అవకాశం లేకుండా పోయింది. దీంతో అటు మిల్లర్లు, ఇటు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల 24న పత్తి కొనుగోళ్ల ప్రారంభం కాగా, ఈ నెల 18వ తేదీ వరకు సీసీఐ పలు విధాలుగా కొర్రీలు పెడుతూనే ఉందని, పత్తిని కొనుగోలు చేసే నాథుడే లేడని రైతులు వాపోతున్నారు. సీసీఐ మద్దతు ధర ఇవ్వకపోవడంతో పాటు కొనుగోళ్లు అరకొరగా చేయడంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో దళారులకు పత్తిని విక్రయించే పరిస్థితి ఏర్పడింది. సీసీఐనే పరోక్షంగా దళారులకు ప్రయోజనం చేకూర్చేలా కొత్త నిబంధనలు తెస్తోందనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

జిల్లాలో 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగు

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, ఎకరాకు 10క్వింటాళ్ల చొప్పున మొత్తంగా 57లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. అయితే అధిక వర్షాలు, తుఫాన్ కారణంతో పత్తి రైతులు నిండా మునిగారు. జిల్లాలో 35వేల ఎకరాల్లో పత్తి రైతులు అధిక వర్షాలతో పాటు తుఫాన్ ప్రభావంతో నష్టపోయారు. దీంతో ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్లు కూడా పత్తి రాని పరిస్థితి ఏర్పడింది. తేమ లేని పత్తికి మాత్రమే క్వింటాకు రూ.8,110 చెల్లిస్తామని సీసీఐ పేర్కొంది. అయితే తేమ పేరుతో సీసీఐ సరైన ధర చెల్లించకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. సీసీఐ సీఎండీ చెప్పిన విధంగా మూడు రోజుల్లో అన్ని జిన్నింగ్ మిల్లులను తెరుచుకోకపోతే జిన్నింగ్ మిల్లుల యజమానులు తిరిగి సమ్మెకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది చూడాల్సి ఉంది.

రెండు రోజులుగా ఇబ్బందులు

● సమ్మెతో పత్తి రైతుల దిగులు

నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్, శాలిగౌరారం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పత్తిని పండించిన రైతులకు విక్రయించాలంటే తిప్పలు తప్పడం లేదు. కాటన్ మిల్లుల యజమానుల సమ్మెతో రైతులు రోజుల తరబడి అమ్ముకోవడానికి దిగాలు పడుతున్నారు. జిన్నింగ్ మిల్లుల సమ్మె వల్ల, నిరవధిక బంద్‌తో రెండు రోజులుగా జిల్లా లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో సత్తి కొనుగోళ్లు చే పట్టలేదు. తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ పిలుపు మేరకు జి న్నింగ్ మిలులు నిరవధిక బంద్ పాటించడంతో 17,18వ తేదీల్లో సీసీ ఐ ద్వారా పత్తి కొనుగోళ్ల చేపట్టలేదు. సీసీఐ ఎల్1, ఎల్2, ఎల్3 పేరి ట పలు మిల్లులు నడిపిస్తూ మరికొన్ని మిల్లులను నడిపించనందున అన్ని మిల్లులను నడిపించాలని ప్రభుత్వానికి, సీసీఐకి పలు మార్లు వి న్నవించినా కూడా ఏమాత్రం స్పందన లేదని, దాని వల్ల సోమవారం నుండి పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. పత్తిని తీసుకవచ్చిన రైతులకు ముందు నుంచే కొనుగోలు చేయడంలేదని యాజమాన్యం తెలిపింది. నిరవధిక బంద్ అంటూ మిల్లు యాజమాన్యాలు గేటుకు ఫ్లెక్సీలు ఏ ర్పాటు చేసి మూసివేశారు.

● నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తిలోని పత్తిని విక్రయించేందుకు తీసుకువచ్చిన 1 డీసీఎం, 1 ఆటో మిల్లు వద్ద నిలిపి వేచి ఉన్నాయి. శాలిగౌరారం మండలం మాదారంలోని టీఆర్‌ఆర్ కాటన్ మిల్లులో సీసీఐ వారు నాలుగు రోజుల నుంచి కొనుగోళ్లు నిలిపివేశారు. మంగళవారం టీఆర్‌ఆర్ కాటన్ మిల్లు వద్ద దాదాపు 20కి పైగా ట్రాక్టర్లు పత్తి లోడుతో బారులు తీసి ఉన్నాయి. మిల్లు గేటు వేసి ఉండటం వల్ల రైతులు నిరీక్షిస్తున్నారు. నార్కట్‌పల్లి మండలంలోని చౌడంపల్లిలో గల వరలక్ష్మీ కాటన్ మిల్లు వద్ద రెండు ట్రాక్టర్లలో రైతులు పత్తిని తీసుకువచ్చి మిల్లు మూసి ఉండటంతో వెనక్కి తీసుకెళ్లారు.



శాలిగౌరారం మండలం మాదారం టీఆర్‌ఆర్ కాటన్ మిల్లు వద్ద ఉన్న పత్తి ట్రాక్టర్లు

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



యాదగిరిగుట్ల ఆలయంలో వేం నరేందర్‌రెడ్డికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, ప్రధానాలయం, పాతగుట్ట లక్ష్మీనరసింహులకు నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన, పాతగుట్ట వద్ద విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో, శివాలయంలో నిత్య పూజలు కొనసాఆయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.35,26,329 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, కొండకింద ఆధ్యాత్మిక వాడ మండపంలో 603 మంది దంపతులు సత్యదేవుని వ్రతాలు జరిపించగా అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి ఆలయంలో బుధవారం వేకువజామున అర్చకులు అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించగా ఆలయ ఈవో గిరిప్రదక్షిణ ప్రారంభిస్తారు.

స్వామి వారి సేవలో ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. యాదగిరికొండకు మంగళవారం సాయంత్రం చేరుకున్న ఆయన కుటుంబ సమేతంగా ముందుగా కొండకింద ఆధ్యాత్మిక వాడలో సత్యదేవుని వ్రతంలో పాల్గొన్నారు. అంతకు ముందు ప్రెసిడెన్షియల్ చేరుకున్న ఆయనకు కలెక్టర్ ఎం.హనుమంతరావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, యాదగిరిగుట్ట తహసీల్దార్ గణేష్‌నాయక్ స్వాగతం పలికారు. అనంతరం ప్రధానాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

స్వామిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రాచార్యులు బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా ధ్వజస్తంభానికి మొక్కి గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తులకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ముఖ మండపంలో అర్చకబృందం ఆశీర్వచనం చేయగా అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి లడ్డు ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు.

మట్టపల్లిలో వైభవంగా నృసింహుని కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో శ్రీస్వామికి మంగళవారం విశేష అర్చనలు జరిగాయి. పుష్పాలంకరణల అనంతరం స్తంభోద్భవునికి ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమాలు చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత మట్టపల్లి లక్ష్మీనరసింహుని మూర్తులను కల్యాణాన్ని కన్నులపండువగా వేదపండితులు నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహర్నివేదనలు నిర్వహించారు. క్షేత్రంలోని శివాలయంలో ఏకాదశ రుద్రాభిషేకం, పంచాయతన పూజలు అర్చకులు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మట్టపల్లిలో కోటి దీపోత్సవం

కార్తీకమాసంలో చివరిరోజు కార్తీక అమావాస్యను పురష్కరించుకొని గురువారం మట్టపల్లి మహాక్షేత్రంలో కోటి దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, గర్భాలయం ఎదుట దీప ప్రజ్వలన, కృష్ణాహారతి అనంతరం రాజగోపురం కోటి వత్తుల దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.



ఎమ్మెల్సీ మల్లన్నకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న మట్టపల్లిరావు

బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● అఖిల బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు



సమావేశంలో మాట్లాడుతున్న బొల్లా వేణుగోపాల్‌రావు

రామగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులను విడుదల చేయాలని అఖిల బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణుగోపాలరావు డిమాండ్ చేశారు.నల్లగొండ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణభవన్‌లో మంగళవారం గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడిజిల్లా కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మనకు ప్రభుత్వ పథకాలు అందాలంటే ఐక్యంగా ఉండి పోరాటం చేయాలన్నారు. పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సహాయం, ఉపకార వేతనాలు పెంచడం, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, గాయత్రి సేవా సంస్థ వ్యవస్థాపకుడు గర్నపూడి శ్రీరామశర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ యువతలో ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంచే కార్యక్రమాలు, చిన్న వ్యాపారాల, స్వయం ఉపాధి రుణాలు, పేద పూజారులు, అర్చకులకు ఆర్థికసాయం వృత్తిపరమైన భద్రత కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యజ్ఞం పవన్ కుమార్‌శర్మ, చకిలం అనిత, రజిని, మణికుంట్ల రాజేశ్వరశర్మ, రుద్రవీణ, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పంతంగిలో ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో సత్యనారాయణ

చౌటుప్పల్ రూరల్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం పంతంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ ఉమ్మడి నల్లగొండ జిల్లా అండర్-17 బాల బాలికల ఖోఖో పోటీలు మంగళవారం అట్టహాసంగా జరిగాయి. డీఈవో సత్యనారాయణ పోటీలను ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన నల్లగొండ, యాదాద్రి టీమ్‌లకు బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 12 మంది విద్యార్థులు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 23, 24, 25తేదీల్లో పంతంగిలో రాష్ట్రస్థాయి ఖోఖో అండర్ 17 పోటీలు జరుగనున్నాయి. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో గురువరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి దశరథరెడ్డి, పొన్నకృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ బాతరాజు సత్యం, దూడల బిక్షంగౌడ్, సప్పిడి లింగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు రెడీ!

(5వ పేజీ తరువాయి)

వార్డులు ఉన్నాయి. వీటిలో 10,73,506 మంది ఓటర్లు నమోదయ్యారు. ఎన్నికల నిర్వహణకు వీలుగా ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను సైతం అధికారులు అందుబాటులో ఉంచారు. వార్డుల వారీగా పక్కా ఓటర్ జాబితాలు ఫొటోలతో సహా నమోదు చేశారు. ఒక కుటుంబం ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా ఓటర్ జాబితాను రూపొందించారు. ఇంటిపక్క ఇళ్లు కూడా ఒకే వార్డులో ఉండేలా చూడడంతో పా టు, వార్డుకు కేటాయించిన ఓటర్లకు మించిన చోట ఒకటి, రెండు ఇళ్లు ఎక్కువ, తక్కువ ఉన్నా ఆ వీధి, లేక వాడ అంతా ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రతీ వార్డుకు ఒక పోలిం గ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. చిన్న పంచాయతీలకైతే ఒకే లొకేషన్‌లో అన్ని పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. 1,000 ఓట్లు దాటిన చోట ప్రభుత్వ స్కూళ్లతో పాటు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు అనుకూలంగా ఉంటే రెండో లొకేషన్‌ను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు పింక్ రంగు బ్యాలెట్ పత్రాలు, వార్డు మెంబర్ స్థానాలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు కూడా సిద్ధం చేశారు.

జిల్లాలో పోలింగ్ స్టేషన్లలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు పోలీస్ బందోబస్తు వినియోగించాలని నిర్ణయించారు. 652 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పోలీస్ అధికారులు గుర్తించగా, 304 సున్నితమైన ప్రాంతాలుగా, మరో 18 అతి సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు. ఇక్కడ అదనపు పోలీస్ బలగాలను నియమించడంతో పాటు, రౌడీషీటర్ల బైండోవర్లు, పాతకేసుల నిందితులను గుర్తించి వివరాలు కూడా సేకరించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడమే తరువాయి పంచాయతీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధంచేశారు.

వరి కొయ్యలు కాల్చొద్దు

● భూసారం దెబ్బతిని దిగుబడి తగ్గే అవకాశం ● అవగాహన లేక కొయ్యలు తగలబెడుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, అడ్డగూడూరు)

వరి సాగు చేస్తున్న రైతులు నారుమడులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. ఓ పక్క వానాకాలం పంట కోతలు కోస్తుండగా మరో పక్క నారుమడులు సిద్ధం చేస్తున్నారు. వరి కోసిన వెంటనే అవగాహన లేక రైతులు వరి కొయ్యలను తగులబెడుతున్నారు. దీని వల్ల అనేక అనర్థాలు ఎదురువుతాయని శాస్త్రవేతలు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా భూసారం దెబ్బతినడంతో పాటు పంటల దిగుబడి తగ్గడం, భూమికి దోహదపడే సూక్ష్మజీవులు నశిస్తాయి. ఇదంత తెలియక రైతులు ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వరి కొయ్యల ను తగలబెడుతున్నారు.



చిన్నపడిశాలలో వరి కొయ్యలను కాల్చుతున్న దృశ్యం

కాల్చడం వల్ల కలిగే నష్టాలు

● వరి కొయ్యలు తగలబెట్టిన ప్రాంతంలో భూమి బిగువుగా మారి నీటిని పీల్చుకొనే గుణాన్ని కోల్పోయే అవకాశం ఉంటుంది.

● కాల్చిన చోట భూమిని సేంద్రీయ పదార్థాలన్నింటినీ కోల్పోతుంది.

● వరికొయ్యలను ఏటా కాల్చడం వల్ల భూసారం తగ్గడంతో పాటు వాయు కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉంది.

● పంటలకు తోడ్పడే సూక్ష్మజీవులపై తీవ్ర ప్రభావం పడుతుంది

● తగలబెట్టడం కంటే వరి కొయ్యలను కలియ దున్ని సూపర్‌పాస్పేట్ చల్లితే వారం రోజుల్లో పూర్తిగా మురుగుపోతుంది.

● దీంతో భూసారం పెరుగుతుంది.

అవగాహన కల్పిస్తున్నాం

వరి కొయ్యలను ఎట్టి పరిస్థితుల్లో తగలబెట్టొద్దు. కాల్చిన చోట భూమి బిగువును మారి నీటిని పీల్చుకొనే స్వభావాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అంతేకాక భూసారం దెబ్బతిని పంటల దిగుబడిపై ప్రభావం పడుతుంది. యాసంగి నారుమడుల కోసం రైతులు సిద్ధమవుతున్నారు. నేలకు అనుగుణమైన రకాలను ఎంచుకుంటే ఎక్కువగా వస్తుంది. ప్రతి ఏటా ఈ విషయంపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

- పాండురంగాచారి, ఏవో, అడ్డగూడూరు

పాటించాల్సిన చర్యలు

● పొలం దున్నే పది రోజులు ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు పారించాలి. తర్వాత ఎకరాకు 50కిలోల సూపర్‌పాస్పేట్ చల్లాలి. దీంతో భూమి దెబ్బతినడం నుంచి తప్పించడమే కాకభూమిలో సేంద్రీయ పదార్థాల స్థాయిని పెంచవచ్చు. ఈ పద్ధతి పాటించడం వల్ల నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం పెరిగి దిగుబడి అవకాశాలు పెరుగుతాయి.

● ప్రతీ సంవత్సరం కోల్పోతున్న భూసారాన్ని వృద్ధి చేసుకునేందుకు పొలాల్లో పశువులు, గొర్రెలు మేకల పేడ వేసుకోవాలి. సాధ్యమైనంత వరకు రసాయన ఎరువులు వాడకం తగ్గించాలి.

నల్లగొండ
నకిరేకల్ - మునుగోడు

పిల్లలను పనికి కాదు.. పాఠశాలకే పంపాలి

మర్రిగూడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను బడికే పంపాలని, పనికి పంపవద్దని మండల పరిధిలోని దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం అన్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థి వారం రోజులుగా పాఠశాలకు రావడం లేదు. దీంతో హెచ్‌ఎం లచ్చిరాం, తరగతి ఉపాధ్యాయుడు సభావత్ వెంకట్ కుమార్ ఫోన్‌ద్వారా అతని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చిన స్పందన లేదు. అయితే మంగళవారం హెచ్‌ఎం లచ్చిరాం తరగతి ఉపాధ్యాయుడు వెంకట్ కుమార్ విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బడిఈడు పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపాలని, పిల్లలకు పనికి పంపవద్దని సూచించారు.అనంతరం విద్యార్థినిని స్కూటీపై పాఠశాలకు తీసుకొని వచ్చారు.


బైక్‌పై విద్యార్థిని తీసుకొస్తున్న టీచర్లు

కుంటలు కబ్జా

- కనుమరుగవుతున్న నీటి వనరులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- సంరక్షించాలని వేడుకుంటున్న ప్రజలు


చిట్యాలలోని పోతురాజుకుంటలో వెలసిన అక్రమ నిర్మాణాలు

చిట్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని ప్రధాన నీటి వనరులు కబ్జాలతో కనుమరుగవుతున్నాయి. చిట్యాల పట్టణంలో అసలే చెరువులు లేవు.. ఉన్న నీటి కుంటలను కబ్జా గురవుతుండటంతో నీటి వనరులు లేకుండాపోయాయి. చిట్యాల పట్టణంలో ప్రధానంగా రెండు కుంటలు ఉన్నాయి. చిట్యాలలో పోతురాజుకుంట, కుమ్మరి కుంటలు కబ్జా కోరల్లో చిక్కుకొని ఉనికిని కోల్పోతున్నాయి. పోతురాజుకుంట చిట్యాలలో 738 సర్వే నెంబర్‌లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ కలిపి సుమారు 14 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ సీజన్‌లో ఇంత భారీ వర్షాలు కురిసినా కుంటలో చుక్క నీరు లేదు. దీనికి ప్రధాన కారణం కుంటలో అక్రమ నిర్మాణాలు చేపట్టడమే కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుంటను పరిరక్షించాల్సిన మునిసిపాలిటీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. కబ్జాలతో పాటు సంరక్షించాల్సిన అధికారులు కుంట ఉనికి లేకుండా పోవడానికి కారణమవుతున్నారు. మునిసిపాలిటీకి చెందిన చెత్తను కుంటలో డంపింగ్ చేయడం వల్ల కుంట నామరూపాలు లేకుండా పోయింది. పరిరక్షించాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా కుంటలో చెత్త వేసి పరోక్షంగా కబ్జాదారులకు సహకరిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. కుంట కబ్జాకు గురికావడంతో ఇటీవల 65వ నెంబర్ జాతీయ రహదారిపై నీరు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అంతేకాక 8వ వార్డులోని జనావాసాలు నీటి ముంపునకు గురయ్యాయి. జాతీయ రహదారి పక్కనే ఉన్న పోతురాజు కుంట కబ్జాకు గురవుతున్నా అటు ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.


జాతీయరహదారిపై నీరు నిలవడంతో ఎస్పీ, ఆర్డీవో పరిశీలించి నీరు పోయేందుకు తాత్కాలిక చర్యలు చేపట్టారు. కానీ కుంటను పరిరక్షించడానికి తీసుకోవాల్సిన శాశ్వత చర్యలపై దృష్టి సారించడం లేదు. కుంట కబ్జాపై ప్రజలు, రాజకీయపక్షాలు ఆందోళన చేసి, అధికారులకు వినతిపత్రాలు అందజేవారు. అయినా రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సర్వే నెంబర్ 755లో కుమ్మరికుంట ఉంది. ప్రస్తుతం దీని పక్కనే వెంచర్ చేశారు. ఈ కుంట కూడా కబ్జాకు గురైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుంటలు కబ్జా కాకుండా సరిహద్దులు నిర్ణయించి జియో ట్యాగింగ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేసున్నారు. చిట్యాలకు ప్రధాన నీటి వనరులైన పోతురాజుకుంట, కుమ్మరికుంటను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

కుంటలకు సర్వే చేయాలి



చిట్యాల పట్టణంలోని పోతురాజుకుంట, కుమ్మరికుంటలకు సర్వే నిర్వహించాలి. అంతేకా సరిహద్దులు పాతడంతో పాటు ఆక్రమణలు తొలగించాలి. నీటి వనరులను సంరక్షించాలి.
- ఎండీ అక్బర్, సీపీఐ మండల కార్యదర్శి

నీటి ముంపు నుంచి కాపాడాలి



వర్షాలు పడిన ప్రతిసారీ తమ షాప్ చుట్టూ వర్షపు నీరు నిలుస్తుంది. దీంతో భారీ వర్షం వచ్చిన ప్రతీ సారి దుకాణం శుభ్రం చేయడంతో పాటు నీరు నిల్వకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి.
- ఎండీ జహీరొద్దీన్, స్థానికుడు

నోటీసులు పంపాం

పోతురాజుకుంట, కుమ్మరికుంటలలో ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేసిన వారికి నోటీసులు పంపాం. కేసు కోర్టులో ఉంది. కోర్టు తీర్పు మేరకు చర్యలు తీసుకుంటాం.
- సంతోష్, ఐబీ ఏఈ

మాదారంలో నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

శాలిగౌరారం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం మాదారం గ్రామంలోని టీఆర్‌ఆర్ కాటన్ మిల్లులోని బుధవారం నుంచి సీసీఐలో పత్తి కొనుగోళ్లను చేపట్టనున్నట్లు శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనా నాయక్ తెలిపారు. రైతులందరూ 8 నుంచి 12 తేమశాతం వచ్చిన పత్తిని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు.

పరిమితికి మించి తరలిస్తే చర్యలు తప్పవు

కనగల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు చేస్తామని ఎస్ఐ రాజీవ్‌రెడ్డి హెచ్చరించారు. కనగల్ ఎక్స్‌రోడ్డులోని ఆటో డ్రైవర్లకు మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పరిమితికి మించి విద్యార్థులను, కూలీలను, ప్రయాణికులను ఆటోల్లో ఎక్కిస్తే ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్ ఆటోడ్రైవర్లకు తప్పని సరిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పవిత్రత, పరిశుభ్రతకు సహకరించాలి

● చెర్వుగట్టు దేవస్థానం ఈవో మోహన్‌బాబు


మాట్లాడుతున్న మోహన్‌బాబు

నార్కట్‌పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆలయ పవిత్రత, పరిసరాల పరిశుభ్రతకు భక్తులు సహకరించాలని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్‌బాబు కోరారు. చెర్వుగట్టుపై ఈవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన చెర్వుగట్టు క్షేత్రం పవిత్రతను కాపాడే తమ ప్రయత్నానికి భక్తులు చేదోడుగా నిలవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థానం తరఫున చేపట్టే చర్యలకు సహకరించాలన్నారు. ముఖ్యంగా స్వామివారి పుష్కరిణిలో స్నానమాచరిస్తున్న భక్తులు తమ సూచనను పాటించాలని కోరారు. తలనీలాలు తీసిన వెంటనే మునగడం, దిష్టిపూజల అనంతరం ధరించిన తడిబట్టలు, పసుపు కుంకుమ, నిమ్మకాయలు, కొబ్బరికాయలు ఇతరత్రా పూజా సామగ్రిని నేరుగా కోనేరులో మునుగుతున్నారని అన్నారు. ఈ విధంగా చేయడం వల్ల నీటిని కలుషితమై ఇతర భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. కోనేరులో దిగి స్నానమాచరించే ముందు పక్కనే తాము ఏర్పాటు చేయనున్న కుళాయిల కింద జల్లు స్నానం చేసి ఆ తర్వాత కోనేరులో స్నానం చేయాలని సూచించారు. చెత్తను చెత్తబుట్టల్లోనే వేయాలని సూచించారు. ప్రసాదాల నాణ్యత, పరిమాణంలో రాజీ పడబోమన్నారు. దేవస్థానానికి ఆదాయాన్ని సమకూర్చే టెండర్ల నిర్వహణలోని లోపాలను గుర్తిం చి పారదర్శకంగా అమలు పరుస్తానన్నారు. బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు అందుబాటులో ఉండేలా ఆలయ సిబ్బంది, పని వేళల్లో కూడా మార్పులు చేశానని ఈవో తెలిపారు.

పెరిక సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లిఖార్జున్‌రావు


మల్లిఖార్జునరావు

కేతేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ కోట మల్లికార్జునరావు పెరిక సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన పురగిరి క్షత్రియ (పెరిక) సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి ముత్తయ్య, సంఘం గౌరవ అధ్యక్షుడు లక్కర్సు ప్రభాకర్‌లు మల్లికార్జునరావు నియామకాన్ని ప్రకటించారు. మల్లికార్జునరావు 20 సంవత్సరాలుగా పెరిక కుల ఐక్యతకు, పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటుకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆయన్ను ఈ పదవిలో నియమిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ కులసంఘం పెద్దలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకునేలా సంఘం ఐక్యత, పెరిక కులస్థుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. పెరిక సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమితులైన మల్లికార్జునరావును చీకటి గూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు అభినందించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చిట్యాలరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపూర్, పేరేపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం దివీస్ లాబొరేటరీస్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులను పరీక్షించిన వైద్యుడు జయంత్‌కుమార్ ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మందు లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పాండు, దివీస్ ప్రతినిధులు ఎస్. సాయికృష్ణ, జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు


సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కనగల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి కార్తీక మాసం భక్తుల రద్దీ కొనసాగుతుంది. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ముఖ్యఅర్చకులు మల్లాచారి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

పోలీసుల శ్రమదానం

● కనగల్ వాగు బ్రిడ్జిపై గుంతల పూడ్చివేత


గుంతలను పూడ్చి వేయిస్తున్న సీఐ ఆదిరెడ్డి

కనగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారి కనగల్ వాగు బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను పోలీసులు శ్రమదానం చేసి శుక్రవారం పూడ్చి వేశారు. ఈ సందర్భంగా సీఐ ఆదిరెడ్డి మాట్లాడుతూ వాగు బ్రిడ్జిపై గోతులు ప్రమాదాలకు కారణమవుతున్నట్లు తెలిపారు. గోతుల్లో పడి పలువురి ప్రాణాలు పోయినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజీవ్ రెడ్డి, పీసీలు వెంకన్న, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యం

● బీజేపీ శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి


కార్యకర్తలను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న మహేశ్వర్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డి

నల్లగొండ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని, రానున్న స్థానిక ఎన్నికల్లో కాషాయ జెండాను ఎగురవేస్తామని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెన్నుగూడెం, పాతూరు గ్రామాల నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్ నేతృత్వంలో మంగళవారం చెన్నూగూగెం గ్రామంలో మహేశ్వర్ రెడ్డి యువకులకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని అన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రజలందరూ బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో గ్రామ గ్రామాన బీజేపీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరినవారిలో యువకులు మర్రి ఏడుకొండల్ యాదవ్, వడ్డెపల్లి లింగస్వామి గౌడ్ లతో పాటు పలువురు యువకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోగరి అనిల్‌కుమార్, చామకూరి మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి చేపట్టిన రైతు దీక్షకు బీజేపీ నార్కట్‌పల్లి మండల నాయకులు సంఘీభావం తెలిపారు. మంగళవారం దీక్షా శిబిరం వద్దకు వెళ్లిన ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మునుకుంట్ల గణేశ్, కౌన్సిల్ మెంబర్ నడింపల్లి శ్రవణ్‌కుమార్, కొర్వి శంకర్, శివ, నగేశ్ తదితరులు నాగంను కలిసి సంఘీభావం ప్రకటించారు.

అమరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

● ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం


చండూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం

చండూరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టుల నూరేళ్ల త్యాగాల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు సిద్ధం అవ్వాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. సీపీఐ శత వసంతాల ఉత్సవాల్లో భాగంగా డిసెంబరు 26న ఖమ్మంలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సీపీఐ చేసిన త్యాగాల చరిత్రను రాష్ట్ర నలుమూలల నేటి తరానికి వివరించేందుకే బస్సు యాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. మంగళవారం చండూరుకు బస్సుయాత్ర చేరుకున్న సందర్భంగా ఆయన రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నర్సింహతో కలిసి మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతీ కార్యకర్త ఎండగట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రజానాట్య మండలి అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్ కళాకారుల బృందం ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నలప రాజు రామలింగయ్య, నాయకులు తిప్పర్తి రాములు, మండల కార్యదర్శి సతీష్‌కుమార్, బొడ్డు వెంకన్న, పల్లె యాదయ్య, కర్నాటి వెంకన్న, బండమీది వెంకటేశం, ఊశయ్య పాల్గొన్నారు.

మర్రిగూడ : భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పోరాడిన ఏకైక రాజకీయ పార్టీ సీపీఐ మాత్రమేనని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాలనరసింహ అన్నారు. బస్సు యాత్ర మర్రిగూడ మండల కేంద్రానికి చేరుకోగా యాత్రకు సీపీఐ మండల ఇన్‌చార్జి కన్వీనర్ బుర్ర శేఖర్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కట్టంగూర్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ కొండల్‌రెడి

కట్టంగూరు, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన సదస్సు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు బానిస కావద్దని, సిగరెట్టు తాగడం, గంజాయి సేవించడం ఇతర మత్తు పదార్థాలను చిన్న వయసులోనే అలవర్చుకోవడం ఫలితంగా జీవితాన్ని ఎంతగానో నష్టపోతారని అన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ రవీందర్, ఉపాధ్యాయులు ఆంథోని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: మాదక ద్రవ్యాలకు, డ్రగ్స్, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని వాటితో జీవితం అంధకారం అవుతుందని శాలిగౌరారం ఎస్ఐ డి.సైదులు అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదేశాల మేరకు ప్రాజెక్టు శుద్ధిలో భాగంగా శాలిగౌరారంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, జెఎంజె హైస్కూల్ విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో గీతాంజలి స్కూల్ కరస్పాండెంట్ దొంతూరి పరమేశ్వర రావు, జెఎంజె హైస్కూల్ ఇంచార్జి పంతంగి జానయ్య, ప్రిన్సిపాల్ ప్రభంజన్, వెంగళి జానయ్య, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది జాని, మనోహర్ పాల్గొన్నారు.

కనగల్: డ్రగ్స్ భూతాన్ని సమాజం నుంచి తరిమి వేయాలని చండూర్ సీఐ ఆదిరెడ్డి అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కనగల్ మోడల్ స్కూల్‌లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజీవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ థామసయ్య, పీసీలు పాల్గొన్నారు.

వార్డుల సమస్యలపై అధికారుల ఆరా


సమస్యలు తెలుసుకుంటున్న మునిసిపల్ కమిషనర్ మల్లేశం, వెంకటేశ్‌యాదవ్

చండూరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): చండూరు మునిసిపాలిటీలో వార్డు సమస్యలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, శానిటేషన్, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యపై మాజీ కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి మంగళవారం మునిసిపల్ కమిషనర్ ఎల్.మల్లేశం వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బందితో కలిసి పట్టణంలో కలియ తిరిగారు. పట్టణంలో ప్రతీ వార్డులో ఉన్న ప్రధాన సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చండూరు మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.15కోట్లు నిధులు మంజూరు చేసింది. పట్టణంలో ఏఏ సమస్యలు ఉన్నాయి, వాటి పరిష్కారానికి ఏమేమి పనులు చేపట్టాలి, నిధులు ఎంత మేరకు ఖర్చు చేయాలనే అంశాలపై పరిశీలించారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

కనగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎడవల్లి గ్రామంలో మంగళవారం కంఠమహేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడి పూజ, హనుమాన్‌స్వామికి అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. గురుస్వామి పెన్న సుబ్రహ్మణ్యస్వామి ఆధ్వర్యంలో గంటస్వామి కర్నాటి సత్య గౌడ్ పర్యవేక్షణలో అయ్యప్ప పడికి ప్రమిదలు వెలిగించి మెట్ల పూజలను, అభిషేకాలను నిర్వహించారు. హనుమాన్ స్వామికి అభిషేకాలను చేశారు. గణేష్, సుబ్రహ్మణ్యస్వామిలకు పట పూజలు జరిపి భక్తి పాటలను ఆలపించారు. స్వామియే శరణం నామస్మరణం మారుమ్రోగి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. అయ్యప్ప, హనుమాన్‌మాలధారణ స్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. గురుస్వామి పోలోజు వెంకటాచారి, గౌని నరేష్, లక్ష్మారెడ్డి, జనార్ధన్ శివ, వినయ్‌చారి ఉన్నారు.


పడిపూజలో పాల్గొన్న స్వాములు

గోపలాయపల్లిపై వైభవంగా మాస కల్యాణం


గోపలాయపల్లి గుట్టపై శివ కల్యాణం చేస్తున్న అర్చకస్వాములు

నార్కట్‌పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మాస శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని హరిహర క్షేత్రమైన గోపలాయపల్లి వారిజాల వేణుగోపా లస్వామి దేవస్థానంలో మంగళవారం పార్వతీ రామలింగేశ్వరస్వామి మాస కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. యాజ్ఞికుడు దత్తాత్రేయశర్మ, అర్చకుడు పవన్ వెంకటాచార్యుల మంత్రోచ్ఛారణల మధ్య శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం నార్కట్‌పల్లికి చెందిన దోసపాటి విష్ణు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు అధిక సంఖ్యలో భక్తులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో.... కార్తీక మాసం మాస శివరాత్రి సందర్భంగా నార్కట్‌పల్లిలోని బస్టాండ్ వెనుక ఉన్న పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కూడా మాస కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు నిడిగొండ భగవాన్ శర్మ యాజ్ఞికంలో స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ వేడుకలో దేవాలయ చైర్మన్ పుల్లెంల శ్రీనివాస్ మంగమ్మ దంపతులు, యాద వెంకన్న సునీత దంపతులు, జెరిపోతుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం

నల్లగొండకల్చరల్: నల్లగొండ పట్టణంలోని తులసీనగర్ శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని ఉదయం అర్చకస్వాములు మంత్రోచ్చారణలతో శివలింగానికి రుద్రాభిషేకాలు చేశారు. అదేవిధంగా రాత్రి విశాలాక్షిసహిత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం జరిగింది. అర్చకస్వాములు శాస్త్రోక్తంగా వేదమంత్రాలతో కల్యాణఘట్టాన్ని సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించి పరవశించిపోయారు. కల్యాణం అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కళాశిక కుశలయ్య, చంద్రశేఖర్, అర్చకస్వాములు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల మాసోత్సవం

మునుగోడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మునుగోడులోని శివరామక్షేత్రంలో మంగళవారం శివపార్వతుల మాస కల్యాణోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకొని నిర్వహించిన వేడుకల్లో ఆలయ ప్రధాన అర్చకులు కొండోజు నవీన్‌కుమార్ తన పురోహిత బృందంతో వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిభావంతో మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శక్తిపీఠం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ మాజీ కోఆప్షన్ సభ్యుడు పాలకూరి నరసింహగౌడ్- రమాదేవి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప, శివ, హనుమాన్ మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజం కోసం కృషి చేయాలి


మర్రిగూడలో పోలీసులకు టీబీ గురించి వివరిస్తున్న డాక్టర్ శాలిని

మర్రిగూడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మరిగూడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శాలిని అన్నారు. మంగళవారం జిల్లా క్షయ నివారణ కేంద్రం, మర్రిగూడ ఎస్ఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రిలో పోలీస్ సిబ్బందికి రక్త నమూనాలను సేకరించి చెస్ట్ రక్త పరీక్షలు నిర్వహించారు. అందులో భాగంగా ముఖ్యంగా బీపీ, షుగర్ ఉన్నవారు టీబీ పరీక్షలు త ప్పనిసరిగా చేయించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీ ఎస్ సైదులు, టీబి నోడల్ సూపర్‌వైజర్ జె. ప్రేమ్ కుమార్, ఎల్టీ బాల నాగరాజు, టెక్నిషియల్ ఎండి అజీజ్. వైద్య సిబ్బంది పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతర పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం


నల్లగొండ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్మికుల స మస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అన్నారు. పట్టణంలోని పద్మానగర్‌లోని మార్కండేయ గుడి వద్ద మంగళవారం తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జనరల్‌బాడీ సమావేశం వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్య పోరాటం నినాదంతో సీఐటీయూ ఏర్పడిందని అన్నారు. నాటి నుంచి కార్మికుల పక్షాన వారి హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు నిర్వహించి సాధించినట్లు తెలిపారు. నల్లగొండ పట్టణంలో 29,30 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా 13వ మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభనుఉ విజయవంతం చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గంజి నాగ రాజు, అవుట రవిందర్, రాజేష్, రాములు, భద్రయ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 28.0
కనిష్ఠం 15.0

***

ANDHRAJYOTHY



నల్లగొండ

5

బుధవారం 19 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.80 (299.7430)	నిల్	14,697
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.20 (4.25)	1,031.82	723.02
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.095 (42.886)	1,000	8,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

జల్‌సాథి అవార్డు అందుకున్న పీడీ శేఖర్‌రెడ్డి



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్.పాటిల్ నుంచి అవార్డు అందుకుంటున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జల్‌సాథి అవార్డును డీఆర్డీవో శేఖర్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో జలశక్తి మంత్రి సీఆర్.పాటిల్ నుంచి అందుకున్నారు. 'జల్ సంచయ్.. జల్ భాగీదారీ'లో భాగంగా కేంద్రం నిర్వహించిన సర్వేలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. అందుకు జిల్లా గ్రామీణా అభివృద్ధి పీడీ వై.శేఖర్‌రెడ్డి ఈఅవార్డును అందుకున్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు

నల్లగొండ కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎంఏ.హఫీజ్‌ఖాన్, కార్యదర్శి బానోతు బాలమ్మ ప్రారంభించారు. ఇందిరాగాంధీ చిత్రాన్ని అంశంగా ఈ పోటీ జరిగింది. అదేవిధంగా 'నా గ్రంథాలయం.. నాకు ప్రోత్సాహం' అనే అంశంపై చర్చా కార్యక్రమం ఆసక్తిగా సాగింది.



పంచాయతీ ఎన్నికలకు రెఢీ

- బీసీ డెడికేషన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా రిజర్వేషన్లు
- నెలాఖరులోగా కొత్త రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం
- ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే సిద్ధమైన అధికార యంత్రాంగం

గ్రామపంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆశావహుల్లో మళ్లీ సందడి మొదలైంది. సెప్టెంబరులోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినా, రిజర్వేషన్ల పరిధి 50శాతం దాటడంతో హైకోర్టు స్టేతో ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లు గవర్నర్ ఆమోదం పొందకపోవడం, హైకోర్టులోనూ కేసులు కొనసాగుతుండడంతో ఎన్నికలు నిలిచి పంచాయతీలకు పాలకవర్గాల్లేని పరిస్థితి కొనసాగుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

రాష్ట్రంలో సుమారు రెండేళ్లుగా పంచాయతీలకు పాలకవర్గాలు లేపోవడంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్‌పడింది. వచ్చే మార్చి నెలాఖరుకు 16వ కేంద్ర ఆర్థిక సంఘం గడువు ముగియనుండడంతో, ఈలోగా పాలకవర్గాలు కొలువుదీరకపోతే రాష్ట్రంలోని పంచాయతీలకు రావాల్సిన సుమారు రూ.3వేల కోట్ల నిధులు వెనక్కివెళ్లే ప్రమాదం నెలకొంది. దీంతో డిసెంబరు నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది.

నెలాఖరుకు రిజర్వేషన్లు వెలువడే ఛాన్స్

కోర్టు తీర్పు రాకమునుపే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించడంతో రిజర్వేషన్లపై ఎలా ముందుకెళ్లాలనే అంశంలో బీసీ డెడికేషన్ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం సలహా కోరింది. వారంలోగా ఈ కమిషన్ నుంచి సూచనలు వచ్చాక, అందుకు అనుగుణంగా పంచాయతీలు, వార్డులకు అధికారిక రిజర్వేషన్లు పునఃకేటాయింపు చేస్తారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు గరిష్ఠంగా 50శాతానికి లోబడి రిజర్వేషన్లు ఇచ్చే క్రమంలో బీసీలకు 25శాతం, ఎస్టీలకు 7శాతం, ఎస్సీలకు 18శాతం రిజర్వేషన్లు అధికారికంగా కేటాయిస్తారని తెలుస్తోంది. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం బీసీ అభ్యర్థులను రిజర్వేషన్లకు మించి 42 శాతానికి తగ్గకుండా కేటాయిస్తారని సగటున 50శాతానికి మించి బీసీ అభ్యర్థులకు టికెట్లు కేటాయించేందుకు పార్టీపరంగా సన్నద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. సెప్టెంబరులో ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ, మహిళల రిజర్వేషన్లను యథావిధిగా కొనసాగిస్తూ, బీసీలకు ఇచ్చిన 42శాతం సీట్లలో డెడికేషన్ కమిషన్ సూచించే ప్రకారం రిజర్వేషన్లు ఉండనున్నాయి. ఏ ప్రాతిపదికన అధికారిక సీట్లలో 25శాతానికి మించి ఉన్న కేటగిరీలను తొలగించాలనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారని అధికార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఎస్సీ, ఎస్టీ స్థానాలు సహా బీసీలకు సైతం మళ్లీ తాజాగా జనాబా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయిస్తారని అంచనా వేస్తున్నారు. డెడికేషన్ కమిషన్ సిఫారసుల ఆధారంగానే తాజా రిజర్వేషన్ల ప్రకటన ఉండనున్నట్టు తెలిసింది. జిల్లా అధికారులు మాత్రం ప్రభుత్వం ఏ విధంగా సూచిస్తే ఆ విధంగా రిజర్వేషన్లు కేటాయించేందుకు అవసరమైన కార్యాచరణను ఇప్పటికే సిద్ధం చేసుకొని ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. గరిష్ఠంగా ఈ నెలాఖరులోగా పంచాయతీల రిజర్వేషన్ల కేటాయింపు పూర్తవుతుందని భావిస్తున్నారు.

సిద్ధమైన అధికార యంత్రాంగం

జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు అవసరమైన ప్రాథమిక కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సర్వం సిద్ధం చేసింది. నల్లగొండ జిల్లాలోని 33 మండలాల్లోని 869 పంచాయతీలకు, 7,494

- మిగతా 7వ పేజీలో...

జిల్లాలో 427 పంచాయతీలు, మొత్తం 3704 వార్డులు ఉన్నాయి. అధికారులు 3,704 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. మొత్తం ఓటర్లు 2,86,430 కాగా, వీరిలో పురుషులు 1,42,585 మంది, మహిళలు 1,43,845 మంది ఉన్నారు. ● సూర్యాపేట జిల్లాలో 486 గ్రామ పంచాయతీలు, మొత్తం 4,388 వార్డులు ఉన్నాయి. అధికారులు 4,403 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో గ్రామీణ ఓటర్లు 6,94,815మంది ఉన్నారు. అందులో 3,40,743మంది పురుషులు, 3,54,050మంది మహిళలు, 22 మంది ఇతరులు ఉన్నారు.

నేటి నుంచి మళ్లీ పత్తి కొనుగోళ్లు

- బంద్‌ను విరమించిన జిన్నింగ్ మిల్లులు
- ఊపిరి పీల్చుకున్న పత్తి రైతులు

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిన్నింగ్ మిల్లుల బంద్‌ను యాజమాన్యాలు విరమించాయి. సీసీఐ నిబంధనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిన్నింగ్ మిల్లులు మంగళవారం బంద్ పాటించాయి. దీంతో రంగంలోకి దిగిన సీసీఐ సీఎండీ జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ నేతలతో భేటీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మిల్లులను రెండు మూడు రోజుల్లో తెరుస్తామని ఆయన హామీ ఇవ్వడంతో జిన్నింగ్ మిల్లుల యజమానులు బంద్‌ను ఉపసంహరించుకున్నారు.

7

ముగిసిన కోట మైసమ్మ
బ్రహ్మోత్సవాలు
● వైభవంగా బోనాలు, కార్తీక దీపోత్సవం
7

మునుగోడు పీఏసీఎస్‌కు
విశిష్ట గుర్తింపు
7

పంతంగిలో ఉమ్మడి జిల్లా
ఖోఖో పోటీలు

గంజాయి సరఫరా
ముఠా అరెస్ట్
6

సాగర్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు పరిశీలన

బీజాపూర్ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ బృందం రాక



బీసీ గురుకుల పాఠశాలలో రక్షణ మంత్రిత్వశాఖ బృందం

నాగార్జునసాగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అధికారుల బృందం పరిశీలించింది. మంగళవారం ఈ మేరకు కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కెప్టెన్ రాజ్యలక్ష్మీపృథ్వీరాజ్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కెప్టెన్ రాజ్యలక్ష్మీపృథ్వీరాజ్ మాట్లాడుతూ సైనిక్ స్కూల్ ఏర్పాటుకు ఈ ఏడాది జూలైలో రాష్ట్రంలో సొంత భవనాలున్న 21 గురుకుల పాఠశాలల నుంచి దరఖాస్తులు అందాయన్నారు. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్, నకిరేకల్ పరిధిలోని మూసీ బీసీ గురుకుల పాఠశాలలకు సంబంధించిన పత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాల ఆట స్థలం, భవనం తదితర అంశాలపై తాము గమనించిన అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు వివరించారు. ఆమె వెంట కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, బీసీ గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ స్వప్న తదితరులు ఉన్నారు.

సైనిక్ స్కూల్ ఏర్పాటుకు సహకరిస్తాం: సబ్ కలెక్టర్

మిర్యాలగూడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అన్ని విధాల సహకరిస్తామని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. మంగళవారం సైనిక్‌స్కూల్ ఏర్పాటుకు నాగార్జునసాగర్ బీసీ బాయ్స్ రెసిడెన్షియల్ స్కూల్, మూసీ బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌ను పరిశీలించి వచ్చిన రక్షణమంత్రిత్వ శాఖకు చెందిన ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ కెప్టెన్, బీజాపూర్ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి పృథ్వీరాజ్, బీసీ వెల్ఫేర్ జిల్లా కోఆర్డినేటర్ స్వప్న, నల్లగొండ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాసుల బృందం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌ను సైనిక్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు అనుకూలమైన అంశాలను చర్చించారు.

యువత మత్తుపదార్థాల బారిన పడొద్దు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్,నవంబరు18 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాల బారినపడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గౌతమి జూనియర్ కళాశాలలో పోలీస్, జిల్లా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మత్తు మందులు,మద్యం వంటి వ్యసనాలకు యువత బానిసలు కావొద్దన్నారు. జీవితం బాగుండాలంటే కష్టపడి చదవాలని సూచించారు. అదనపు ఎస్పీ రమేష్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారప డి ఉందన్నారు.అనంతరం మత్తుపదార్థాలకు దూరం గా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం కృషి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ క్రైం): మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్ ప్రమాదంలో పడుతుందన్నారు. యువత మత్తు నిరోధక సంకల్పాన్ని పెంపొందించుకోవాలని, అందుకు జిల్లా పోలీస్‌శాఖ తరపున పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



ధాన్యం కొనుగోలులో కుంభకోణం

బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్‌లీడర్ మహేశ్వర్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణానికి పాల్పడుతోందని బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతు నిరాహార దీక్ష విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు మోసపూరిత ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక రైతులను, యువతను మోసగిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,500కోట్ల కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. తన ఆరోపణలు నిజం కాదని కాంగ్రెస్ నాయకులు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. తన సవాల్‌ను స్వీకరించే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో ఏ వర్గాలు సంతోషంగా లేవన్నారు. పోరాటాల గడ్డ నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు హెలికాప్టర్లలో ప్రయాణిస్తూ చక్కర్లు కొడుతూ ఎంజాయ్ చేస్తున్నారని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ నేత గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతరెడ్డి, నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజు, పోతేపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, ఫకీరు మోహన్‌రెడ్డి, ఓరుగంటి వంశీ, గడ్డం మహేష్, మిర్యాల వెంకటేశం, సురకంటి రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, నేత పిల్లి రామరాజు నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.



రైతు నిరాహార దీక్ష విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



చింతపల్లిలో జాతాకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ సత్యం, మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు

చింతపల్లి, కొండమల్లేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో డిసెంబరు 26న నిర్వహించే సీపీఐ శతాబ్ది ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. మంగళవారం చింతపల్లి మండల కేంద్రంలో, కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చేరిన ప్రచార జాతాలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహించడంలో సీపీఐ ముందు వరుసలో ఉందన్నారు. రాజ్యాంగ హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఎం.బాలనరసింహ, పల్లా నర్సింహారెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, ఆర్.అంజయ్యనాయక్, పల్లా దేవేందర్‌రెడ్డి, తూం బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, వి.ఆంజనేయులు, జగన్, గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, శేఖరాచారి, జయరాములు, సుదర్శన్‌రెడ్డి, రామస్వామి, కల్లు చరణ్‌రెడ్డి, సోమ్లానాయక్, వెంకటయ్య, అంజనాయక్, పోలే వెంకటయ్య, ఉజ్జిని అంజన్‌రావు, మల్లోజు శేఖరాచారి, వేముల బుచ్చయ్య, పల్లపు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ వందేళ్లుగా పేదల పక్షాన

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): సీపీఐ వందేళ్లుగా ప్రజలపక్షాన పోరాడుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం గద్వేల్‌కు చేరిన బస్సుజాతాలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే వందేళ్ల ముగింపు ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

కొండమల్లేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. డిండి మండలానికి వెళ్లివస్తూ ఇక్కడికి వచ్చిన ఆయన ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో స్వర్ణలత, ఎంపీవో మధు, వినోద్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ

నల్లగొండ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డితో కలిసి మంగళవారం జిల్లా కేంద్రంలోని పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి అనుమానాస్పద లింకులు, యాప్స్, మెసెజ్‌లు ఓపెన్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపాలరావు, సైబర్ క్రైం ఎస్‌ఐ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య బీమాతో ధీమా

ఆరోగ్య బీమా ప్రతీ ఒక్కరి జీవితానికి ధీమా ఇస్తుందని అదనపు ఎస్పీ రమేష్ అన్నారు. మంగళవారం హోంగార్డు సిబ్బందికి ఆరోగ్య బీమాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టిసారించాలని, ఏదైనా అనుకోని సమస్య వస్తే బీమా ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, హోంగార్డు ఆర్‌ఐ శ్రీను, బ్యాంక్ మేనేజర్లు సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సహజ పద్ధతుల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

చిట్యాలరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హానికరమైన రసాయనాలతో వ్యవసాయం చేస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని, సహజ పద్ధతుల్లో వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రాయితీలు కల్పిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుండ్రాంపల్లిలో పలువురు రైతుల వరి చేలను ఆయన పరిశీలించారు. వరి నారుమడి ఎదుగుదల గురించి తెలుసుకొని సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహజ పద్ధతిలో వ్యవసాయ సాగుతో ఆరోగ్యకర పంటలు చేతికివస్తాయన్నారు. ఎరువులు, పురుగుమందులు అధికంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతిని పంటల దిగుబడి తగ్గడమేగాక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. చలికాలంలో వరినారు ఎదుగుదలకు రైతులు తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. నారుమడిలో వెదురు కర్రలతో ఊతమిచ్చి పైన పలుచని పాలిథిన్ షీట్ లేదా యూరియా బస్తాలతో తయారు చేసిన పట్టాలను సాయంత్రం వేళల్లో కప్పాలని, మరుసటి రోజు తీసేయాలన్నారు. చలికి నీరు చల్లబడుతుందని, దాన్ని తొలగించి తిరిగి నీటినందించాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి పగిడిమర్రి గిరిబాబు, ఏఈవో మీనాకుమారి ఉన్నారు.



గుండ్రాంపల్లిలో వరి చేనును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రీజనల్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.2కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పాండు రంగయ్య, కేవీఎస్.రెడ్డి, వెంకటయ్య, జమాల్, ఎన్ఆర్ఎస్.రాజు, ఎం.నందం, వీఎస్.రెడ్డి, ఏఎల్.స్వామి, కోటయ్య, వెంకన్న, మంజుల, చంద్రకళ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టెట్ అర్హత నిబంధనను ఎత్తివేయాలి

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి

నల్లగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు గుదిబండలా మారిన టెట్ అర్హత నిబంధనను ఎత్తివేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కాళం నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2010 తర్వాత నియామకమైన ఉపాధ్యాయులకు మాత్రమే టెట్‌ను పరిమితం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందని, అది విచారణలోకి రాకముందే తిరిగి ప్రభుత్వం హడావిడిగా టెట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థులకు పరీక్షా సమయం కావడంతో ఇలాంటి సమయంలో ఉపాధ్యాయులు విధులను సక్రమంగా నిర్వహించలేక మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెట్ ప్రభావం రాష్ట్ర వ్యాప్తంగా 45,742మంది ఉపాధ్యాయులపై ఉందన్నారు.

22న గీత కార్మికుల సదస్సు

చిట్యాలరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని గీతపనివార సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గుండ్రాంపల్లిలో సంఘం ఆధ్వర్యంలో ప్రచార కరపత్రాన్ని సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గీత కార్మికుల సమస్యలు ఏళ్లుగా అపరిష్కృతంగానే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.13కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, కార్మికులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలని, గీత స్కిల్ యూనివర్సిటీని, గీత కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభికం కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మిద్దెల రామలింగయ్యగౌడ్, బొడిగె బక్కశెట్టి, ఉయ్యాల చంద్రయ్య, మారగోని యాదయ్య, గోపగోని అచ్చులు, కేయగూర యాదయ్య, నమ్ముల కృష్ణయ్య, గోపగోని శెట్టి, పాలెం జంగయ్య, చెదురుపల్లి శ్రీను, పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' ఏదీ?

చందంపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నా, నేటివరకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుకు నోచలేదు. 2023 ఎన్నికల సమయంలో భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12వేలను బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ఉపాధిహామీలో కనీసం 20 రోజులు పనిచేసి ఉండి ఎలాంటి భూమిలేని నిరుపేదలకు ప్రతీ సంవత్సరం రెండు విడుతలుగా రూ.12వేలను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు మండలస్థాయిలోని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు 29 గ్రామాల్లో దాదాపు 300 నుంచి 400 మంది వరకు లబ్ధిదారుల జాబితాను తయారుచేశారు. ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో ఆత్మీయ భరోసా నిధులు జమచేయలేదు. పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని తెల్దేవరపల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. అక్కడ కూడా నిధులు జమకాకపోవడం గమనార్హం. భూమి ఉన్న యజమానులకు రైతుభరోసా కింద సంవత్సరానికి రూ.13వేలు జమచేస్తున్నారని, భూమిలేని తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల ఏపీవోను వివరణ కోరగా జిల్లా అధికారుల ఆదేశాలమేరకు లబ్ధిదారుల జాబితాను జిల్లా అధికారులకు పంపించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులపై తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని వివరించారు.


హరిజనపురంలో విద్యార్థులులేక నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం

పాఠశాలల భవనాలు
నిరుపయోగంగా..

గుర్రంపోడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లేకపోవడంతో పలు ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. గుర్రంపోడు మండలంలో మొత్తం 64 ప్రభుత్వ పాఠశాలలుండగా, అందులో ప్రస్తుతం 52 పాఠశాలలు కొనసాగుతున్నాయి. 12 పాఠశాలలు మూతపడగా ఆ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. గుర్రంపోడు మండలంలో 38 గ్రామపంచాయతీలుండగా, చాలా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలులేవు. కొన్ని గ్రామాల్లో పాఠశాలల భవనాలు గ్రామపంచాయతీ కార్యాలయాలుగా ఉపయోగిస్తున్నా, చాలాచోట్ల ఉపయోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరే అవకాశం ఉంది. నిరుపయోగంగా ఉన్న మిగిలిన భవనాలను కమ్యూనిటీహాళ్లుగా, ఇతర అవసరాలకు ఉపయోగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

వెంకటేశ్వర్లు, ఎస్ఐ, వేములపల్లి



వేములపల్లి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వేములపల్లి ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. సైబర్ నేరాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా యువతకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.
(ఆంధ్రజ్యోతి-వేములపల్లి)

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇసుక అక్రమ, రేషన్ బియ్యం రవాణా నియంత్రణపై ఏం చర్యలు చేపడుతున్నారు?

ఎస్ఐ: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు గస్తీ నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ అనుమతితో ఇసుక రవాణా చేయాలి. అక్రమ రేషన్ దందాకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తాం.

ఆంధ్రజ్యోతి: నార్కట్‌పల్లి- అద్దంకి రోడ్‌పై రాంగ్‌రూట్‌లో ప్రమాదాల నివారణకు ఏమైనా చర్యలు చేపడుతున్నారా?

ఎస్ఐ: రాంగ్‌రూట్ ప్రయాణాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రాంతాల్లో దొంగతనాల నివారణకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారు?

ఎస్ఐ: గ్రామాల్లో దొంగతనాల నివారణకు గ్రామాలవారీగా ఉదయం, రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నాం. ప్రజలు సైతం గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానంగా సంచరించినట్లయితే మాకు సమాచారం అందించాలి.

'టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి'

మిర్యాలగూడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్ కోరారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు ప్రస్తుతం రిటైర్‌మెంట్ సమయంలో టెట్ పాస్‌కావాలనే నిబంధన విధించడం సరికాదన్నారు. విద్యాశాఖలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించటం సరైనదే అయినప్పటికీ టెట్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి టెట్ తప్పనిసరి అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సీటీఈ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 2012 తర్వాత ఎంపికైన ఉపాధ్యాయులందరూ టెట్ పాసై ఉన్నారని, ఆర్టీఐ యాక్ట్ అమల్లోకి రాకముందు ఉన్న ఉపాధ్యాయులకు టెట్‌నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.

ఉపాధ్యాయురాలి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

డిండి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఐదు రోజుల క్రితం డెంగ్యూ వ్యాధితో మృతి చెందిన డిండి కేజీబీవీ ఉపాధ్యాయురాలు నాగమణి కుటుంబానికి మండల ఉపాధ్యాయులు మంగళవారం రూ.67వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాగమణి స్వగ్రామమైన చందంపేట మండలం పొగిళ్ల గ్రామంలో ఆమె కుటుంబ సభ్యులకు నగదు అందజేసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంఈవో గోప్యానాయక్, డి.రాజేందర్‌రెడ్డి, జి.రామారావు, గొడుగు శ్రీనివాస్, ఎ.వెంకట్‌రెడ్డి, పల్లె వెంకటయ్య ఉన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

నిడమనూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పథకం పేద ప్రజలకు వరంలాంటిదని నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.14.01 లక్షల విలువైన చెక్కులను మంగళవారం మార్కెట్ కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో దోహదం చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోట్ల సైదులు, ఆలంపల్లి కృష్ణ, కంచి పాపయ్య, వెంకటరమణ, మెరుగు శ్రీను, జానిపాషా, శిరిషాల యాదగిరి, చర్క శ్రీను పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

చింతపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంకటేశ్వరనగర్(గొడకొండ్ల)కు చెందిన మాల ధరించిన అయ్యప్పమాలధారులకు మంగళవారం అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ మేరకు శబరికొండ అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి చైర్మన్ కనిగిరి గోవర్ధన్ మాట్లాడుతూ దాతల సహకారంతో నవంబరు 18వ తేదీ నుంచి జనవరి 5 తేదీ వరకు నిరంతరంగా అన్నదానం చేస్తామన్నారు.

పీఆర్‌సీ కమిటీ నివేదికను అమలు చేయాలి


బాలరాజు, రమాదేవి

వేములపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):పీఆర్‌సీ కమిటీ నివేదికను వెంటనే అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్ నుంచి మినహాయించాలన్నారు. అధ్యక్షులుగా బైరం బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా మోటె రమాదేవి, ఉపాధ్యక్షులుగా చిట్యాల జానయ్య, గాదరి యాదమ్మ, కోశాధికారిగా మాడుగుల సుమన్, కార్యదర్శులుగా పి.శ్రీనివాస్, సీహెచ్.సైదులు, రవీందర్, హరితలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

కొండమల్లేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. కొండమల్లేపల్లి చౌరస్తాలో రహదారి విస్తరణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఎస్ఐ అజ్మీరా రమేష్ ఉన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం

● నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి


తిరుమలగిరి(సాగర్)లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా తాను కృషి చేస్తున్నట్లు నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్‌యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. నూతనంగా ఏర్పాటైన మండలంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదవారికి ఒక్క ఇల్లు కూడా మంజూరైన దాఖలాలు నియోజకవర్గంలో లేవని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తుందన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో సమీకృత ప్రభుత్వ భవనాల సముదాయాలను నిర్మించేందుకు వీలుగా నాలుగు ఎకరాల భూమిని సేకరించి అనుమతులు తీసుకొచ్చినట్లు, త్వరలోనే తహసీల్దార్, ఎంపీడీవో, పీహెచ్‌సీ, పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. విద్యుత్ కొరతను తీర్చేందుకు మండలానికి విద్యుత్ సబ్ స్టేషన్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి అక్కడ సుమారు రూ.10లక్షలతో కొనసాగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి, పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం జడ్పీహైస్కూల్‌కు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు పాఠశాల ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫోటో జర్నలిస్టుగా పనిచేస్తూ జాతీయ స్థాయిలో అవార్డు పొందిన పుట్టా నాగేశ్వర్‌రావును ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్, ఎంఈవో శ్రీనివాస్, ఏపీఎం రాజేశ్వరి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్‌రెడ్డి, నాయకులు శాగం రాఘవరెడ్డి, రమావత్ కృష్ణానాయక్, లాలునాయక్, ఆంగోతు పాండు, ఆంగోతు శ్రీను, బూడిద కొండల్, కే.నగేష్, డీలర్ బాలు, పాపిరెడ్డి, పసుపులేటి కృష్ణయ్య, మునినాయక్, షేక్ రహీం, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమాలు

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న బంటు వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టుపార్టీ కొనసాగించిన వందేళ్ల ప్రజా ఉద్యమాలను మననం చేసుకుని, ప్రజా సమస్యలపై మరింతగా ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలసాధిపత్య దురహంకారానికి వ్యతిరేకంగా, దేశస్వాతంత్ర్యానికై పోరాడుతూ స్వతంత్ర భారతంలో రాజ్యాంగంలోని కొన్ని అంశాలను తమకు అనుకూలంగా మలచుకుని పాలకవర్గాలు అమలు చేస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ పోరాడుతూ వస్తోందన్నారు. ప్రజా సమస్యలే ఏకైక ఎజెండాగా పోరాడుతూ ఎందరో అమరుల త్యాగాలతో ఎరుపెక్కిన ఎర్రజెండా నేటికీ పేదలకు అండగా నిలబడిందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో అధికారం కోసం అడ్డదారులు తొక్కి ప్రజల ఆకాంక్షలను అణగదొక్కుతూ నిరంకుశ విధానాలు అవలంబిస్తున్నారన్నారు. ప్రజా చైతన్యంతో వాటిని తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆధ్వర్యంలో గద్వాల నుంచి భద్రాద్రి కొత్తగూడెం వరకు ఈ నెల 15న ప్రచారజాత చేపట్టినట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ నెల 20న ప్రచార జాతా మిర్యాలగూడకు చేరుకుంటున్న సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి అంజనపల్లి రామలింగం, నాయకులు రాజేశ్వరి, ఎస్‌కే షమీం, రమేష్, రైతుసంఘం నాయకులు బుచ్చయ్య పాల్గొన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

హాలియా, నవంబరు18(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి చట్టబద్ధత కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుగు లక్ష్మీనారాయణ, గౌరవ సలహాదారుడు జవ్వాజి వెంకటేశ్వర్లు డిమాండ్‌చేశారు. మంగళవారం హాలియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ తరఫున 42 శాతం రిజర్వేషన్లు ఇస్తూ ఎన్నికలకు పోదామని నిర్ణయించారన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కావాలంటే పార్లమెంట్‌లో 9వ షెడ్యూల్‌లో పెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, సింగం లక్ష్మీనారాయణ, అందెం తిరుపతయ్య, బొమ్మపాల కొండల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై రాజకీయ పార్టీలది కపటప్రేమ

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బీసీలపై రాజకీయ పార్టీలన్నీ కపటప్రేమ ప్రదర్శిస్తున్నాయని బీసీ సంక్షేమసంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. మంగళవారం జరిగిన బీసీ సంక్షేమసంఘం ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై రాజకీయ డ్రామా జరుగుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు తామంతా మద్దతు ప్రకటిస్తున్నామంటూ చెబుతున్న రాజకీయ పార్టీలు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేలా కేంద్రప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి చేయడంలేదన్నారు. కొందరు బీసీ నేతలు సైతం రాజకీయపార్టీలకు తొత్తులుగా వ్యవహరించడంతో, ఎంత పోరాడినా ఫలితం దక్కడంలేదంటూ ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొండ రామకృష్ణరాజు, రాష్ట్ర కార్యదర్శి కర్నాటి రామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుణగంటి వెంకటన్నగౌడ్ పాల్గొన్నారు.

సేవారంగంలోనూ రాణించాలి

దేవరకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవలోనూ రాణించాలని ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ సైదానాయక్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి అన్నారు. మంగళవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో దేవరకొండ ఆర్టీసీ బస్టాండ్, డిపో ఆవరణంలో పిచ్చి మొక్కలను తొలగించి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ సైదులు, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, ఎక్సైజ్ ఎస్ఐ నర్సింహ, ప్రోగ్రాం అధికారులు జయప్రకాష్, కవిత, సుచరిత పాల్గొన్నారు.

బుద్ధవనంలో కార్తీక వనభోజనాలు

నాగార్జునసాగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్ కాలనీలో ఉన్న బుద్ధవనంలో మంగళవారం కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధవనంలో ఉన్న ఉసిరిచెట్లకు పూజలు నిర్వహించారు. అనంతరం సిబ్బంది అంతా కార్తీక భోజనాలు చేశారు. కార్యక్రమంలో బుద్ధవనం ఈవో శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డి, నర్సింహారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత


క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎంఈవో

పెద్దవూర, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతునూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు దాతల సహకారంతో అందించిన క్రీడా దుస్తులను ఎంఈవో తరి రాము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో దాతలు మాజీ ఉపసర్పంచ్ పెండ్యాల వెంకటేశ్వర్‌రావు, పెండ్యాల నారాయణరావు, మాధవరం దేవానంద్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామ్‌నాయక్, రామ్మూర్తి, మేహజాబి, అంజద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

హాలియా, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండలో ఈ నెల 17న జరిగిన అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు హాలియాలోని ఆకాంక్ష పాఠశాలకు చెందిన హర్షిత్‌కుమార్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోదాల రవీందర్ తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థి 18, 19 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. హర్షిత్‌కుమార్‌ను పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు, తడకమల్ల శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కరీం, చంద్రశేఖర్ అభినందించారు.

మహాసభను జయప్రదం చేయాలి

హాలియా, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో ఈ నెల 28వ తేదీన నిర్వహించే కల్లుగీత కార్మిక సంఘం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వేములకొండ పుల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం హాలియాలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పాలక ప్రభుత్వం గీత కార్మికులకు గతంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, ప్రతీ గీత కార్మికుడికి 50 ఏళ్లు నిండిన వారికి రూ.4వేల పింఛన్ ఇవ్వాలని, జీవో నెం.560 ప్రకారం ప్రతీ సొసైటీకి ఐదు ఎకరాల భూమిని ఇవ్వాలన్నారు. మహాసభకు ఇంటికో మనిషి, ఊరుకో బండి కదలి రావాలని పిలుపునిచ్చారు. నర్సింగ్ సైదులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కాట్నం పరమేష్, కాట్నం సైదులు, కాసాని సత్త్య, దేవరకొండ లింగమయ్య, కాసాని జానయ్య పాల్గొన్నారు.

ప్రతీ గింజనూ కొనుగోలు చేస్తాం

● సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి ● దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం చందంపేట మండలం పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పీఏసీఎస్ ఆవరణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు వచ్చి విక్రయించుకోవాలన్నారు. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొండ్రు శ్రీశైలం, గోవిందు యాదవ్, బద్యనాయక్, ఏవో లక్‌పతి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

దేవరకొండ: ప్రభుత్వ పథకాలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ మార్కెట్‌యార్డులో 250మందికి మంజూరైన రూ.1.18కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధి, షాదీముబారక్, కల్యాణలక్ష్మీ రూ.75లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చి, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ, డిండి, చింతపల్లి, పీఏపల్లి తహసీల్దార్లు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జయశ్రీ, అర్షద్, మహిమూద్, ప్రశాంత్, నేతలు సిరాజ్‌ఖాన్, బిక్కునాయక్, లోకసాని కృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేరేడుగొమ్ము: నేరేడుగొమ్ము మండలం పేర్వాల గ్రామంలోని హనుమాన్ దేవాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. పేర్వాల గ్రామంలో గాయత్రి మహాయజ్ఞానికి హాజరై పూజలు నిర్వహించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


దేవరకొండలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ సుదర్శన్

దేవరకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. మంగళవారం దేవరకొండ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. మాదక ద్రవ్యరహిత సమాజంకోసం కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. దేశాభివృద్ధిలో యువత, విద్యార్థులు కీలకపాత్ర పోషించనున్నట్లు తెలిపారు. అవగాహన సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, మునిసిపల్ మేనేజర్ అర్చన, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్‌గౌడ్, శత్రునాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, మునిసిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌రహిత సమాజం కోసం కృషి చేయాలి

చింతపల్లి: విద్యార్థులతోపాటు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీడీపీవో సక్కుబాయి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని అలుకా జైహింద్‌రెడ్డి కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నషా ముక్త్ భారత్ కుషాల్ భారత్ స్కీమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామస్వామి, సూపర్‌వైజర్లు అంజమ్మ, వైష్ణవి, ప్రసన్న, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: యువత మత్తును వీడాలని ఎస్ఐ సైదిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో మానసిక, శారీరక అనారోగ్యం బలపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కేకే జయరాజన్, సుజయ్‌కుమార్, ఝాన్సీ జయరాజన్ పాల్గొన్నారు.